ప్రజాశక్తి

గురువారం 24 ఆగస్టు 2023 8 పేజీలు





గుంటూరు పల్నాడు

కౌలు కోసం ఎదురుచూపులు



రాజధాని కోసం సేకరించిన భూములు

- కోర్టు ఆదేశిస్తేనే చెల్లింపులు?
- మూడేళ్లుగా రాజధాని రైతులకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రాజధాని నిర్మాణం నిమిత్తం 2015లో సిఆర్‌డిఎకు భూములు అప్పగించిన రైతులకు మూడేళ్లుగా కౌలు మొత్తం అందడం లేదు. పదేళ్లపాటు కౌలును ఏటా 10 శాతం పెంచేలా 2015లో అప్పటి టిడిపి ప్రభుత్వం రాజధాని రైతులకు కౌలుసాయం ప్రకటించింది. మెట్ట భూములకు ఎకరాకు రూ.30 వేలు, మూడు పంటలు పండే జరీబు భూముల రైతులకు ఎకరాకు రూ.50 వేలు కౌలు అప్పటి టిడిపి ప్రభుత్వం నిర్ధారించింది. భూ సమీకరణలో రైతులు 22,736 మంది భూములు ఇవ్వగా వీరికి 2015 నుంచి 2019 వరకు సకాలంలో కౌలుడబ్బులు వారిఖాతాల్లో జమయ్యాయి. 2020 నుంచి ప్రతియేటా జాప్యమవుతోంది. 2021 నుంచి ప్రతి ఏటా కోర్టులో పిటీషన్ దాఖలు చేసిన తరువాతనే రైతులకు కౌలుసాయం అందిస్తున్నారు. ఈ ఏడాది మేలో ఇవ్వాల్సిన కౌలు సొమ్ము ఇంతవరకు రైతుల ఖాతాల్లో జమ కాలేదు. దీంతో మళ్లీ రైతులకు హైకోర్టును ఆశ్రయించారు. పిటీషన్లను విచారణకు స్వీకరించిన హైకోర్టు ప్రభుత్వ వాదనను దాఖలు చేయాలని ఆదేశించింది.

2014 డిసెంబరులో ఏర్పడిన సిఆర్‌డిఎ చట్టం ప్రకారం 2015 జనవరి 2 నుంచి 29 గ్రామాల్లో భూ సమీకరణ ప్రారంభమైంది. దాదాపు ఏడాది పాటు ఈ ప్రక్రియ కొనసాగింది. సిఆర్‌డిఎ చట్టం ప్రకారం మూడేళ్లలో భూములు ఇచ్చిన రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్‌లను అప్పగించాల్సి ఉంది. కానీ గత ప్రభుత్వ హయాంలో నాలుగేళ్లలో ఈ ప్రక్రియ ఏ మాత్రమూ ముందుకు సాగలేదు. మొత్తం 33,771 ఎకరాల భూమిని రైతులు సిఆర్‌డిఎకు కేటాయించారు. ఇందుకు ప్రతిగా అభివృద్ధి చేసిన ప్లాట్లను ఇవ్వాల్సి ఉండగా కేవలం కాగితాలకే పరిమితం చేశారు. మొత్తం 16 ప్రాంతాల్లో ప్లాట్లు కేటాయించారు. గృహ అవసరాలు, వాణిజ్య అవసరాలకు కలిపి ఒక్కో రైతుకు రెండు రకాల ప్లాట్లు వచ్చాయి. మొత్తం 54 వేల పాట్లు ఏర్పాటు చేసినట్లు రికార్డులో చూపారు. అభివృద్ధి చేసిన ప్లాట్లు రైతులకు తిరిగి అప్పగించే వరకు కౌలు మొత్తం చెల్లించాల్సి ఉంది. పదేళ్ల కాలంలో రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు అప్పగించకపోవడంతో కౌలు చెల్లింపు అనివార్యంగా మారింది. అభివృద్ధి చేసిన ప్లాట్‌లను అప్పగింతకు సంబంధించి గత ప్రభుత్వం మొత్తం 16 ప్యాకేజిల్లో చేపట్టిన పనులు 2019 మే వరకు 5 శాతం మాత్రమే పూర్తి కాగా వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో గత మార్చిలో అభివృద్ధి చేసిన ప్లాట్లను మూడు నెలల్లో రైతులకు అప్పగించాలని హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలను ప్రభుత్వం అమలు చేయలేదు. ఈ ఆదేశాలపై ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టును తీర్పులో కొన్ని అంశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. దీంతో ప్లాట్లు ఇవ్వకపోగా, సకాలంలో కౌలు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నాయి. వైసిపి ప్రభుత్వం తీరుపై 1344 రోజులుగా రైతులు ఉద్యమం కొనసాగిస్తున్నారు.



గుంటూరులో ఇస్రో విజయాన్ని హర్షిస్తూ జాతీయ జెండాల ప్రదర్శనలో డిప్యూటీ మేయర్ సజీల

జయహో ఇస్రో..

- చంద్రయాన్ ల్యాండింగ్‌పై హర్షాతిరేకాలు
- విద్యార్థులకు అవగాహన కోసం ప్రత్యేకంగా టీవీల్లో వీక్షణం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడంపై గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ప్రత్యక్ష ప్రసారాన్ని చూసేందుకు విద్యాసంస్థల్లో టీవీలు ఏర్పాటు చేశారు. విద్యార్థులను సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 గంటలవరకు చంద్రయాన్-3 ల్యాండింగ్‌ను వీక్షించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నిర్ధేశిత సమయానికి చంద్రుడి దక్షిణ ధృవంపై ల్యాండింగ్ జరిగినట్టు ప్రత్యక్షప్రసారం ద్వారా సమాచారం రావడంతో విద్యార్థులు, అద్యాపకులు, తల్లిదండ్రులు కేరింతలు కొట్టారు. గుంటూరు పాత బస్టాండ్ వద్ద ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలు చేతబూని జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు. ఫ్రంట్ అధ్యక్షులు అబ్దుల్ కలీం, డిప్యూటీ మేయర్ సజీల తదితరులు పాల్గొన్నారు.

ప్రస్తుత రాజకీయ పరిణామాలపై గుంటూరులో రేపు సభ

- హాజరు కానున్న సిపిఎం జాతీయ నేత బివి రాఘవులు
- జయప్రదం చేయాలని సిపిఎం, ప్రజాసంఘాల నాయకుల ప్రచారం
- 25 ఉదయం పెదనందిపాడులో తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం ప్రారంభం

5లో



2లో

పవర్‌లిఫ్టర్ సాదియా ఆల్మాస్‌కు ఘన స్వాగతం

గుంటూరు,పల్నాడు జిల్లాల్లో భారీ వర్షం

ప్రజాశక్తి -గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో బుధవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. గుంటూరులో కుండపోతగా వర్షం కురవడంతో పలు ప్రాంతాల్లో రోడ్లపై వర్షం నీరుపారింది. పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గుంటూరు, కాకుమాను, మేడికొండూరు, పొన్నూరు, వట్టిచెరుకూరు, పల్నాడు జిల్లా ముప్పాళ్ల, నర్సరావుపేట, చిలకలూరిపేట, యడ్లపాడు, నాదెండ్ల తదితర ప్రాంతాల్లో భారీ వర్షం, మిగతా ప్రాంతాల్లో ఒక మోస్తరుగా వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రతతో అల్లాడిన ప్రజలకు భారీ వర్షంతో చల్లటి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడింది. మరో వైపు వర్షాలతో జగనన్న కాలనీల్లో నీరు చేరింది. పల్నాడు జిల్లాలో ఇప్పటికీ ఈనెలలో అతి తక్కువ వర్షపాతం నమోదైంది. గుంటూరు జిల్లాలో కొంత మేరకు వర్షపాతం మెరుగ్గా ఉంది. జిల్లాలో జూన్ మొత్తం 97.1 మిల్లీ మీటర్లవర్షం కురవాల్సి ఉండగా ఇప్పటివరకు 105.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. జులైలో 164.9 మిల్లీమీటర్లకు గాను 255.2 మిల్లీమీటర్లు, ఆగస్టులో 164.7 మిల్లీ మీటర్లకు గాను బుధవారం వరకు 89.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. పల్నాడు జిల్లాలో జూన్ నెలలో 80.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 81.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జులైలో 131 మిల్లీ మీటర్లకుగాను 106.9 మిల్లీ మీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. ఆగస్టులో 139.8 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 40.9 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.



ప్రత్తిపాడు-గొట్టిపాడు రహదారిలో లోతట్టు బ్రిడ్జీపై నుంచి ప్రవహిస్తున్న వర్షపునీరు

తెలుగు భాషను అందరూ ఆదరించాలి

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న జేసీ రాజకుమారి

మాతృభాష తెలుగును వ్యవహారిక భాషగా తీర్చిదిద్దిన గిడుగు వెంకట రామమూర్తి కృషి మరువలేనిదని గుంటూరు జిల్లా జెసి జి.రాజకుమారి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో గిడుగు వెంకట రామమూర్తి జయంతి వారోత్సవాల్లో భాగంగా జిల్లాస్థాయి అధికారులకు రెండు నిమిషాలు ఇతర భాష పదాలు పలకకుండా తెలుగులో మాట్లాడే పోటీలు, స్థానిక ప్రముఖులతో కవి సమ్మేళనం నిర్వహించారు. జెసి మాట్లాడుతూ తెలుగు భాషను ఆదరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలుగు భాషా వారోత్సవాలను 23-29 తేదీల్లో నిర్వహించుకుంటునట్లు తెలిపారు. ఇందులో భాగంగా

2లో

గెలుపునకు అవసరమైన ఒక్క అవకాశాన్నీ వదలొద్దు

- వైసిపి శ్రేణులకు విజయసాయిరెడ్డి పిలుపు
- మంత్రులు, ఎమ్మెల్యేలతో విడివిడిగా అంతర్గత సమావేశం

4లో





మధ్యాహ్న భోజన పరిశీలన

ప్రజాశక్తి-తెనాలి, చేబ్రోలు

రాష్ట్ర ఫుడ్ కమిటీ సభ్యులు జి.దేవి బుధవారం తెనాలి పట్టణం చంద్రబాబునాయుడు కాలనీలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో, మండలంలోని పెదరావూరు జెడ్‌పి పాఠశాలలో, చేబ్రోలు మండలం నారాకోడూరు జెడ్‌పి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. గిరిజన గురుకుల పాఠశాలకు చేరుకున్న ఆమె మెనూ అమలు తీరు, సరకుల నిల్వ, తదితరాలను పరిశీలించారు. భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. బియ్యంలో ఏమైనా తేడా ఉంటే వాటిని ఉపయోగించవద్దన్నారు. అక్కడి నుంచి పెదరావూరు జెడ్‌పి పాఠశాలకు వెళ్లి భోజనాన్ని పరిశీలించారు. అధిక శాతం విద్యార్థులు ఇంటి నుంచి భోజనాన్ని తెచ్చుకోవటాన్ని గమనించిన అసహనం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించిదనే ఆరోపణలున్నాయని, దీనిపై హెచ్‌ఎం శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. నారాకోడూరు జెడ్‌పి పాఠశాలకు వెళ్లిన దేవి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం తయారీ, రికార్డులను తనిఖీ చేశారు. 9వ తరగతి విద్యార్థులు పఠనా శక్తిని పరిశీలించి విద్యార్థుల రీడింగ్ నైపుణ్యం పెంచుకోవాలన్నారు. ట్యాబుల వినియోగంపై సూచనలు చేశారు. ఎన్‌సిసిలో నైపుణ్యం ప్రదర్శించిన కేడెట్లకు 'ఎ' సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఓ విద్యార్థిని చిత్రలేఖ ప్రదర్శన నైపుణ్యాన్ని అభినందించారు. కార్యక్రమాల్లో జిల్లా పౌరసరఫరాల అధికారి కె.పద్మ, ఎస్‌డబ్ల్యూవో జి.శైలజ. అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ వి.భిక్షాలు, తెనాలి ఎంఇఒ డాక్టర్ ఎం.లక్ష్మీనారాయణ, గిరిజన బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.విజయకుమార్, నారాకోడూరు జెడ్‌పి పాఠశాల హెచ్‌ఎం ఎం.ఏడుకొండలు తెనాలి డివైఇఒ ఎం.నిర్మల, గుంటూరు డివైఇఒ వెంకటేశ్వరరావు, చేబ్రోలు ఎంఇఒ ఆర్.సుబ్బారావు పాల్గొన్నారు.

ముటుకూరులో ప్రత్యేకాధికారి పర్యటన

ప్రజాశక్తి-దుర్గి



మండలంలోని ముటుకూరులో మండల ప్రత్యేకాధికారి సంజీవరావు బుధవారం పర్యటించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన డాక్టర్లు బి.నాగరాజు, బి.శివరామకృష్ణ, సిబ్బందితో మాట్లాడి అందించాల్సిన సేవలపై పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక సచివాలయం సమీపంలోని అంగన్వాడీ-5 కేంద్రాన్ని సందర్శించి పిల్లల బరును పరిశీలించారు. పిల్లలు తక్కువ బరువు ఉండడం, కేంద్రం ఎదుట గేదెలను కట్టేసి ఉంచడం, అపారిశుధ్యం, దుర్గంధంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తర్వాత జెడ్‌పి పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. పలు అంశాలపై హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డితో మాట్లాడారు. కార్యక్రమంలో తహశీల్దార్ జి.రమేష్ కుమార్, ఎంపిడిఒ సమతావాణి, ఎంఇఒ బెంజిమెన్, అంగన్వాడీ సూపర్‌వైజర్ నాగేంద్రం, అడ్మినిస్ట్రేషన్ అధికారి శివప్రసాద్ ఇఒపిఆర్‌డి గుప్తా పాల్గొన్నారు.

తెలుగు భాషను అందరూ ఆదరించాలి

(మొదటి పేజీ తరువాయి)

అన్ని పాఠశాలలు, కాలేజీల్లో వ్యాస రచన, వక్తృత్వం, తెలుగు పద్య పోటీలు, కవితలు, అంత్యాక్షరి, జానపద గేయాల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ తెలుగుభాష ఔన్నత్యం గురించి వివరించారు. మరే ఇతర భాషలు నేర్చుకోవాలన్నా మాతభాష తెలుగు అందుకు పునాది వేస్తుందన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ కె.చంద్రశేఖర్‌రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





చంద్రయాన్ 3 విజయవంతంపై హర్షం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

చంద్రయాన్ 3 ప్రయోగం విజయవంతం కావడంపై టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి కన్నా లక్ష్మీనారాయణ హర్షం వ్యక్తం చేశారు ఇస్రో శాస్త్రవేత్తలకు ఆయన అభినందనలు తెలిపారు.

ప్రజాశక్తి - మాచర్ల

చంద్రయాన్ 3విజయవంతంగా చంద్రమండలంపై దిగడం పై జనవిజ్ఞాన వేదిక పలనాడు జిల్లా గౌరవాధ్యక్షులు వెంకట్రామయ్య, కే ఆదినారాయణ హర్షం వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

చంద్రయాన్ -3 ప్రయోగం విజయవంతం అయినా సందర్భంగా ప్రత్తిపాడు మండల కేంద్రం లోని అక్షయ విద్యాలయం విద్యార్థులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అభినందనలు తెలియ చేసారు. ఈ సందర్భంగ అక్షయ విద్యలయం డైరెక్టర్ వేలగ శ్రీ వల్లి మాట్లాడారు.



ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం కంభంపాడు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అధ్యాపకులు విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. అంతకుముందు పాఠశాల విద్యార్థులతో విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ పాఠశాల విద్యార్థులు ఇస్రో ఆంగ్ల అక్షరాలలో మానవహారంలా ఏర్పడి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాశక్తి- రెంటచింతల

చంద్రయాన్ 3 విజయవంతం కావడంతో మండల వ్యాప్తంగా ఉన్న పాఠశాల విద్యార్థుల్లో హర్షాతిరేకం వ్యక్తం అయింది. ఫ్రెండ్స్ ఇన్ నీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు.

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక బోస్‌రోడ్డులోని నెహ్రూ నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు చంద్రయాన్ 3 ప్రయోగాన్ని పాఠశాల్లో ప్రత్యక్షంగా వీక్షించారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ దాసరి పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసారం చూస్తున్న విద్యార్థులు, విక్రమ్ ల్యాండర్ మాడ్యూల్ చంద్రుడి దక్షణ ధృవంలో నిర్ధేశించిన ప్రాంతంలోకి ప్రవేశించిన వెంటనే కేరింతలు కొట్టారు.

ప్రజాశక్తి-తాడేపల్లి :జయహో ఇస్రో... జయజయహో చంద్రయాన్ అంటూ తాడేపల్లి పట్టణంలోని సుందరయ్యనగర్ శ్రీ ప్రతిభ స్కూల్ విద్యార్థులు బుధవారం సుందరయ్యనగర్ కట్టపై రెండు కిలోమీటర్ల మేర ర్యాలీ నిర్వహించారు. సుమారు 300 మంది విద్యార్థులతో జరిగిన ర్యాలీ స్థానికులను విశేషంగా ఆకర్షించింది. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



దంత సమస్యలపై నిరక్ష్యం వద్దు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ

నోరు శుభ్రంగా లేకపోతే ఎన్నో ఇతర అనారోగ్య సమస్యలు చుట్టుముడుతాయి. చిగుళ్ల నొప్పి, పంటి నొప్పి, పళ్ల నుండి రక్తం కారడం, పళ్లు పుచ్చుపట్టిపోవడం, వంటివి అయితే మీరు ఆపంటి నోప్పిని భరించడమే కాదు. ఒకవేళ ఆదంతం తీసేయాల్సి వస్తే నలుగురిలో వెళ్లేందుకు ఇబ్బందిగా ఫీల్ అవుతారు. వీటన్నిటికీ గురికాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ దంతాలపై శ్రద్ధ చూపి, పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉందని ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ మురళీస్ శ్రీ కృష్ణ డెంటల్ కేర్ డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. నోరు శుక్రభంగా ఉండాలంటే దంతాలు పరిశుభ్రంగా ఉండటం అత్యంత అవసరమన్నారు. లేదంటే పళ్లు పుచ్చిపోవడం, నోరు వాసన రావడం, తిన్న ఆహారం సరిగా జీర్ణం కాకపోవడం వంటి సమస్యలు వస్తాయన్నారు. దంతాలు ఆరోగ్యంగా ఉంటేఉ ఆరోగ్యంగా ఉన్నట్లు అన్నారు. ఎందుకంటే మనం తినే ఆహారమంతా నోటి నుండే పోతుందని, కనుక నోరు శుభ్రంగా ఉండటం తప్పనిసరి అన్నారు. నోరు శుభ్రంగా లేకపోతే ఎన్నో ఇతర అనారోగ్యాలు వస్తాయన్నారు. పంటి సమస్యలు పోషకాల లేమికి కూడా దారితీస్తాయన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లల్లో పంటి సమస్యలు ఉండటం వల్ల పోషకాహారం తినకుండా బలహీనంగా మారతారన్నారు. ఓరల్ హెల్త్‌ను మెయిన్‌టెయిన్ చేయడం పెద్ద కష్టమేమీ కాదని అన్నారు. రోజూ రెండు సార్లు బ్రష్ చేసుకోవడంతో పాటు రెగ్యులర్‌గా డెంటల్ చెకప్స్ చేయించుకోవాలన్నారు.

రోజూ బ్రష్ చేసుకునేటపుడు కొన్ని చిన్న విషయాలను గుర్తుంచుకుంటే పంటి సమస్యలను దూరం చేసుకోవచ్చన్నారు. కొంత మంది రుద్దినట్లు బ్రష్ చేస్తారని ఇలా బలవంతంగా చేసే బ్రషింగ్‌తో పంటిపైన ఉన్న సున్నితమైన ఎనామిల్ పొర డ్యామేజ్ అవుతుందన్నారు. దీనితో మీకు సెన్సిటీవిటీ సమస్య పట్టుకువస్తుందన్నారు. మరీ బండగా బ్రష్ చేయవద్దన్నారు. కొందరు నిముషాల తరబడి బ్రష్ చేస్తారన్నారు. కొంత మంది నామమాత్రాంగా చేస్తారని ఇలా కాకుండా దంతాలను పరిశ్రుభంగ్రా రెండు నుమషాలు బ్రష్ చేసుకోవడం అవసరమని తెలిపారు.

దంతాలతో పాటు చిగుళ్ల కూడా ముఖ్యమైనవి అన్నారు తరచూ చిగుళ్ల రక్తం కారితే జాగ్రత్త పడాల్సిన అవసరం ఉందన్నారు. కరకరలాడే పదార్థాలు తిన్నపుడు చిగుళ్ల గాయాల పాలవుతాయన్నారు. ఏదైనా తిన్న తరువాత చిన్న చిన్న ముక్కలు పంటి మధ్యన, చిగుళ్లపై పేరుకోకుండా జాగ్రత్త పడాలని, చిగుళ్లపై పదార్థాలు పేరుకుంటే ఇన్ఫెక్షన్లు, వచ్చే అవకాశం ఉందన్నారు. కాబట్టి తరచూ నీటితో పుక్కిలించాల్సిన అవసరం ఉందన్నారు. ఇలా చేయడం వలన చిక్కుకున్న ఆహారం బయటకు వస్తుందన్నారు.



డాక్టర్ మురళీకృష్ణ

ఆహారాన్ని నమిలేందుకు దంతాలను వాడాలి

ఆహారం నమిలి తినేందుకు మాత్రమే దంతాలను వాడాలన్నారు. ఓపెనర్‌గా, ప్యాకేజింగ్ టేపు తీసేందుకు, బట్టలు కుట్టేసమయంలో దారం తెంచేందుకు, నట్స్ పగులకొట్టేందుకు దంతాలను ఉపయోగించవద్దని అన్నారు. దంతాలు చాలా బలంగా ఉన్నాయని పదే పదే ఇటువంటి పనులు చేయడం వల్ల దంతాలు పాడయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఏది ఏమైనా దంతాలతో పాటు,చిగుళ్ల కూడా సంరక్షించుకోవాల్సిన అవసం ఉందని, ప్రతి ఒక్కరూ దంతాలు, చిగుళ్లకు సంబంధించి ఎటువంటి సమస్యల వచ్చినా వెంటనే దంత వైద్యులను సంప్రదించి తగు చికిత్స తీసుకోవాలన్నారు.

సాదియా ఆల్మాస్ కు ఘన స్వాగతం

ప్రజాశక్తి - మంగళగిరి, తాడేపల్లి రూరల్

షార్జా యూనివర్సిటీలో యూఏఈ వేదికగా ఈనెల 16వ తేదీ నుండి 22వ తేదీ వరకు మొదటిసారిగా జరిగిన ఏషియన్ యూనివర్సిటీస్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ పోటీల్లో మంగళగిరికి చెందిన షేక్ సాదియా ఆల్మాస్ నాలుగు బంగారు పతకాలు, స్ట్రాంగ్ ఉమెన్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. ఈ క్రమంలో షార్జా నుండి గన్నవరం విమానాశ్రయానికి బుధవారం వచ్చిన సాదియా ఆల్మాస్‌కు మంగళగిరి పవర్ లిఫ్టర్ అసోసియేషన్ కార్యదర్శి విజయభాస్కరరావు, కోచ్ షేక్ సంధాని, కెఎల్ యూనివర్సిటీ స్పోర్ట్స్ డిపార్ట్మెంట్ ప్రతినిధులు, విద్యార్థిని విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. సాదియా ఆల్మాస్ కెఎల్‌యు విద్యార్థిని కావడంతో వడ్డేశ్వరంలోని కెఎల్‌యు క్యాంపస్ నుండి ఎంబిఎ విబాగాధిపతి డాక్టర్ కె.హేమదివ్య అధ్వర్యంలో రెండు బస్సుల్లో విద్యార్థులు, అధ్యాపకులు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని సాదియాకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సాదియాను వర్శిటీలోని విసి చాంబర్‌కు ఊరేగింపుతో తీసుకువచ్చారు. వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు ఆమెను సత్కరించారు. తమ యూనిర్శిటీలో ఎంబిఎ ప్రథమ సంవత్సరం చదువుతున్న సాదియా అల్మాస్ విజయం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. మన రాష్ట్రంలో ఇంతటి ఘనత సాధించిన ఏకైక ఫవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి సాదియా మాత్రమే అని పేర్కొన్నారు. సాదియాను వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్. ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, ఎం.హెచ్ఎస్.డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు, విద్యార్థి సంక్షేమ విబాగాధిపతి డాక్టర్ సిహెచ్.హను మంతరావు, సలహాదారు డాక్టర్ హబీబుల్లాఖాన్, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్, పీడీలు అభినందించారు. సాదియా ఆల్మాస్ మాట్లాడుతూ తన విజయానికి సహకరించిన కేఎల్ యూనివర్సిటీ యాజమాన్యానికి, ఇండియా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి జె జోసెఫ్, సౌత్ ఇండియా కార్యదర్శి ఎస్ కోటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షులు ఎం.ప్రభాకర్, గౌరవ అధ్యక్షులు జి.వెంకటేశ్వర్లుకు కతజ్ఞతలు తెలిపారు.



షేక్ సాదియాను సత్కరిస్తున్న కెఎల్ యు రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు

ప్రజాశక్తి
గుంటూరు, పల్నాడు 3
గురువారం 24 ఆగస్టు 2023

ప్రకాశం పంతులుకు ఘన నివాళి



శంకర్‌విలాస్ సెంటర్‌లో టంగుటూరి ప్రకాశం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

విలక్షణ రాజకీయంతో.. విప్లవాత్మకమైన సంస్కరణలతో.. మొట్టమొదటి ముఖ్యమంత్రిగా రాష్ట్ర అభివద్ధి, సంక్షేమంకోసం చిత్తశుద్ధితో కృషి చేసిన మహనీయుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని శాసనమండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి కీర్తించారు. ప్రకాశం పంతులు జయంతి వేడుకలు గుంటూరు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బుధవారం శంకర్‌విలాస్ సెంటర్‌లోని ప్రకాశం చౌక్ వద్ద ఆంధ్రకేసరి అభిమాన సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, ఎమ్మెల్యే మద్దాళి గిరి, మిర్చియార్డు ఛైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ తదితరులతో కలిసి ప్రకాశం పంతులు విగ్రహానికి ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకష్ణ (ఆచారి) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైసిపి సుందర రామశర్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ బత్తుల దేవానంద్, గీతామందిరం ఛైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, మిర్చియార్డు వైస్ ఛైర్మన్ షేక్ మాబు సుభాని, కార్పొరేటర్ షేక్ రోషన్, కోనూరు సతీష్, విజయమాధవి, ఐతి సతీష్, కాకి శ్రీను, రవి, రెడ్డి కోటేశ్వరరావు, భాగ్యారావు, సింగు నరసింహారావు పాల్గొన్నారు.

చంద్రగిరి ఏసురత్నం నివాళి

ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం నివాళులర్పించారు. టిడిపి పశ్చిమ కార్యాలయంలో ఇన్‌ఛార్జి కోవెలమూడి రవీంద్ర ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు జయంతి వేడుకలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయసంస్థలో ఛైర్మన్ బత్తుల దేవానంద్ ఆధ్వర్యంలో ప్రకాశం జయంతి వేడుకలు జరిగాయి. **మంగళగిరి:** మంగళగిరి,తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యా లయంలో టంగుటూరి ప్రకాశం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అదేవిధంగా ఏపీఎస్పీ క్యాంపులో టంగుటూరు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ యు.శారదా దేవి, సెక్రెటరీ పి.శ్రీనివాసరావు, అడిషనల్ కమిషనర్ కె.హేమమాలిని, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, రెవెన్యూ అధికారి ఎం బాబురావు, ఏపీఎస్పీ క్యాంప్ లో జరిగిన కార్యక్రమంలో కమాండెంట్ కె ఎస్ ఎస్ వి సుబ్బారెడ్డి, అడిషనల్ కమాండెంట్ ఈ ఎస్ ఈ సాయి ప్రసాద్, అసిస్టెంట్ కమాండెంట్ దేవానంద్ హనుమంతు, మల్లికార్జున రావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా



నివాళులర్పిస్తున్న పల్నాడు జిల్లా ఎస్పి వై. రవిశంకర్‌రెడ్డి

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ వై.రవి శంకర్‌రెడ్డి, టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు స్వాతంత్ర్య పోరాటంలో ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు చంద్ర శేఖర్, రాఘవేంద్ర,రామ చంద్ర రాజు, ఏఆర్ డిఎస్పీ చిన్నికృష్ణ పాల్గొన్నారు. **పెదకూరపాడు:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో,గారపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రకాశం పంతులుకు నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యా యులు కాకాని వెంకట రమణ,మార్క్యాపరపు శివనాగేశ్వరరావు పాల్గొన్నారు. **దుర్గి:** స్థానిక జంగాల కాలనిలో, వీర ముష్టి కాలనీలోని ట్యూషన్ పిల్లలతో ఎంపిపి పాఠశాలలో ప్రకాశం పంతులుకు నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ ఓ సి /టిడిహెచ్ క్లస్టర్ కోఆర్డినేటర్ కోట యోహాను, సర్పంచ్ రాయపాటి మాణిక్యం పాల్గొన్నారు. **వినుకొండ:** స్థానిక మున్సిపల్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడు కలు నిర్వహించారు. వినుకొండ నియోజకవర్గ బ్రాహ్మణ డెవలప్‌మెంట్ సొసైటీ నివాళులర్పించింది. **విజయపురిసౌత్:** మాచర్ల మండలంలోని తాళ్లపల్లి గ్రామ సచివాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి-రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోనే సెంట్ ఆన్స్ పాఠశాల వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు విద్యార్థులు గాయపడినట్లు ఎస్సై శ్యామ్యూల్ రాజీవ్ కుమార్ తెలిపారు వేగంగా వస్తున్న కారు రోడ్డు దాటుతున్న షేక్ బాజీ,షేక్ అబ్దుల్ రజాక్, తిక్క ఆకాష్, కుక్క మోడీ రాజు, సన్నగంటి ఈశ్వర్,ను ఢీ కొట్టింది ఈ ఘటనలో షేక్ బాజీ షేక్ అబ్దుల్ రజాక్ పిడుగురాళ్లకు తరలించుగా మిగతా వారిని స్థానికంగా చికిత్స చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శామ్యూల్ తెలిపారు

26న విజయవాడలో ధర్నా

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఈ నెల 26న విజయవాడ లో జరిగిన జరిగే ధర్నాను జయప్రదం చేయాలని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు షేక్. జాలీల్ పిలుపు నిచ్చారు. మంగళగిరి రూరల్ ఆ పార్టీ కార్యాలయం లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ముస్లింలకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిని కుటుంబానికి ఆర్థిక సాయం



చిన్నారులకు బాండ్లు అందిస్తున్న డిసిఒ, చంద్రశేఖర్ తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో గుంటూరు, రేపల్లెలో పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన డేటా ఎంట్రీ ఆపరేటర్ నాగరాజకుమారి కుటుంబానికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు రూ.1లక్ష ఆర్థిక సాయం అందించారు. ఈ మొత్తాన్ని నాగరాజకుమారి పిల్లలిద్దరికీ చెరొక రూ.50వేల చొప్పున బాండ్ తీశారు. బుధవారం సదరు బాండ్ పేపర్లను సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ కె.పద్మజ చేతులమీదుగా నాగరాజకుమారి పిల్లలకు అందచేశారు. కార్యక్రమంలో ఎస్.చంద్రశేఖర్, రాంబాబు, మేరిసి, కరిముల్లా, దినేష్, కిషోర్, గోపి, అజయ్, వీరాంజనేయులు పాల్గొన్నారు.



మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	: 33,805
మిర్చి ఎగుమతి	: 33,299
మిర్చి నిల్వ	: 13,971

మిర్చి ధరలు

రూపాయలలో

334	10,000 - 24,000
నెం.5	12,000 - 21,000
273	19,500 - 21,500
341	10,000 - 21,000
	నాన్ ఎసి
తేజ	9,800 - 24,500
బడిగి	11,000 - 26,000
దేవనూరు డీలక్స్	17,500 - 22,000
తాలుకాయలు	5,000 -14,500
	ఎసి
334	15,000 - 20,000
నెం.5	23,000 - 23,000
273	20,000 - 20,000
341	13,000 - 23,000
4884	12,000 - 20,000
తేజ	9,000 - 24,000
బడిగి	17,500 - 25,000
దేవనూరు డీలక్స్	18,000 - 21,000
తాలుకాయలు	6,000 -13,500

తెలుగు వ్యవహారిక భాషా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

గిడుగు రామ్మూర్తి పంతులు జన్మదిన సందర్భంగా తెలుగు వ్యవహారిక భాషా దినోత్సవంను పురస్కరించుకొని బుధవారం స్థానిక సుజాత కళాశాలలో జరిగిన వకత్వ వ్యాసరచన పోటీలలో వెల్లలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ కు చెందిన విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రమేష్ తెలిపారు. కళాశాల స్థాయిలో జరిగిన వక్తృత్వ పోటీలలో సీనియర్ బైపిసి విద్యార్థిని ఎం.అలేఖ్య ప్రథమ స్థానంలోను, వ్యాసరచన పోటీలలో జూనియర్ సీఈసీ విద్యార్థిని టి.జగదీశ్వరిఉజ్వల ప్రథమ స్థానంలో నిలువగా, పాఠశాల స్థాయిలో జరిగిన పద్యధారణ పోటీలో ఎనిమిదో తరగతి విద్యార్థిని జె.చిన్మయి ప్రథమ స్థానంలో, వక్తృత పోటీలో పదవ తరగతి విద్యార్థిని టి.శ్రీనిధి ప్రథమ స్థానాలను సాధించారని తెలిపారు. ఈ నెల 24న జరిగే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని అన్నారు.

దొంగతనాల కట్టడికి ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి-ఈపూరు



బొమ్మరాజుపల్లి గుడిలో ఏర్పాటు చేసిన సోలార్ మోషన్ సెన్సార్ లైట్

మండలంలో దొంగతనాలను కట్టడి చేసేందుకు గస్తీ పెంచడంతో పాటు సాంకేతిక పరిజ్ఞాన పరికరాలను వినియోగిస్తున్నట్లు ఎస్సై షేక్ మహమ్మద్ ఫిరోజ్ తెలిపారు. మండలంలోని బొమ్మరాజుపల్లిలోని శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఆలయంలో పలుమార్లు దొంగతనాల నేపథ్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటుతో పాటు అధునాతన తాళాలు, సోలార్ మోషన్ సెన్సార్ లైట్స్ ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇంటికి తాళాలు వేసి ఎక్కడికైనా వెళ్లే సమయంలో స్థానిక పోలీస్ స్టేషన్ లో సమాచారం అందించడం ద్వారా ఆ ప్రాంతంలో నిఘా పెంచడంతోపాటు ఎల్‌హెచ్ఎంఎస్ లు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామపంచాయతీలలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు దాతలు సహకరించాలని ఎస్సై కోరారు.

ఓట్ల తొలగింపునకు కుట్ర : టిడిపి



డిఆర్ఒకు ఫిర్యాదు చేస్తున్న జగ్గారావు

ప్రజాశక్తి - ఈపూరు : మండలంలోని ఎ.ముప్పాళ్లలో ఓటర్ల ఇంటింటి సర్వేలో తప్పుడు వివరాలను నమోదు చేస్తున్నారని, 200 మంది టిడిపి అభిమానుల ఓట్ల తొలగింపుకు కుట్ర చేస్తున్నారని టిడిపి పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి ఆర్.జగ్గారావు ఆరోపించారు. ఈ మేరకు డిఆర్ఒను బుధవారం జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని ఆయన కార్యాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. టిడిపి అనుకూల ఓట్లు అధికంగా ఉన్న పోలింగ్ బూత్‌లలో సర్వేలో భాగంగా ఓటర్లు స్థానికంగా ఉంటున్నా వేరేచోట ఉంటున్నారని, స్థానికంగా లేరని తదితర కారణాలు చూపుతూ తొలగించే ప్రయత్నం చేస్తున్నారని వివరించారు.



రైల్వే స్టేషన్లో పడిగాపులు పడుతున్న ప్రయాణికులు

జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రద్దుతో అవస్థలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను 29వ తేదీ వరకూ రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. విజయవాడ సెక్షన్‌లో రైల్వే ఇంజినీరింగ్ పనులు కారణంగా సత్తెనపల్లి రైల్వేస్టేషన్ మీదుగా వెళ్లే ట్రైన్ నం: 12805 విశాఖపట్నం - లింగంపల్లి, ట్రైన్ నం: 12806 లింగంపల్లి -విశాఖపట్నం జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు. దీంతో సత్తెనపల్లి నుండి సికింద్రాబాద్ వెళ్లే రైల్వే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడ నుండి లింగంపల్లి వెళ్లే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ ఉన్నా గుంటూరు తరువాత ఎక్కడా ఆగకుండా వెళుతుంది. అర్ధరాత్రి తర్వాతే సికింద్రాబాద్ వైపునకు ఎక్స్‌ప్రెస్‌లున్నాయి.

అట్యా-పాట్యా రాష్ట్రస్థాయి పోటీల్లో వాగ్దేవి విద్యార్థులకు ఛాంపియన్‌షిప్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

కర్నూలులో ఈనెల 18, 19, 20 తేదీల్లో నిర్వహించిన 8వ రాష్ట్రస్థాయి అట్యా-పాట్యా పోటీల్లో వాగ్దేవి జూనియర్ కాలేజీ విద్యార్థులు ఛాంపియన్లుగా నిలిచారు. మూడ్రోజులపాటు నిర్వహించిన పోటీల్లో పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం వహించిన వాగ్దేవి కాలేజీ విద్యార్థులు జజ్జా యశ్వంత్, షేక్ ఆల్‌మాస్ ప్రథమ స్థానం సాధించారు. ఈ సందర్భంగా వీరి అభినందన సభ కాలేజీలో బుధవారం నిర్వహించారు. కళాశాల సెక్రెటరీ - కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ కాలేజీలో చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇస్తామని, తమ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించడం ఇందుకు తాజా ఉదాహరణని చెప్పారు. ఇదే స్ఫూర్తిని భవిష్యత్‌లోనూ కొనసాగిస్తామన్న ఆయన విద్యార్థులు మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో తమ కాలేజీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపడం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు పాశం కృష్ణారావు, పివి అచ్యుతరావు, కాట్ల రామకోటేశ్వరరావు, కపిలవాయి రాజేంద్రప్రసాద్, పీడీ రాయల ఆంజనేయులు, విద్యార్థులు పాల్గొని ఛాంపియన్లకు అభినందనలు తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న రాయల శ్రీనివాసరావు తదితరులు

బంగారం కోసం మరోసారి ఆందోళన

- దొడ్లేరు సిజిజిబి ఎదుట ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బాధిత రైతుల రాస్తారోకో
- అందరికీ న్యాయం చేస్తామని రీజినల్ మేనేజర్ హామీతో విరమణ

ప్రజాశక్తి - క్రోసూరు



మండలంలోని దొడ్లేరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ (సిజిజిబి) బ్రాంచ్‌లో రైతులు తనఖా పెట్టిన బంగారం విషయంలో అవినీతి జరిగిన విషయం తెలిసిందే. ఇది ఈనెల 10వ తేదీన వెలుగులోకి వచ్చినా బ్యాంకు అధికారులు మాత్రం తమకు స్పష్టమైన హామీ ఇవ్వలేదని బాధితులు ఆగ్రహానికి గురయ్యారు. బ్యాంకు ఎదుట బుధవారం మరోసారి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు జి.రవిబాబు మాట్లాడుతూ అసలు తమ బంగారం ఉందో లేదో అని రైతులు ఆందోళనకు గురవుతున్నారని, దీనిపై ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పలుమార్లు అధికారులను కలిసినా సరిగా స్పందించలేదన్నారు. బ్యాంకులో బంగారం పరిశీలన కౌంటర్లను పెంచకుండా వచ్చేనెల 28వ తేదీ వరకు చెక్ చేస్తామని చెప్పటం గందరగోళానికి గురి చేస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా స్పష్టమైన హామీ ఇవ్వకుంటే ఆందోళనను కొనసాగిస్తామని హెచ్చరించారు. కౌలురైతు సంఘం మండల కార్యదర్శి టి.హనుమంతరావు మాట్లాడుతూ అధికారులు బ్యాంకు చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో ఖాతాదారుల సమస్యల గురించి మాట్లాడకుండా 'ఇక్కడికి రైతులను ఎవరు రమ్మన్నారు' అని మాట్లాడటం సరైంది కాదన్నారు. ఖాతాదార్లకు భరోసా కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇదిలా ఉండగా రాస్తారోకో సమాచారం అందుకున్న ఎస్ఐ పాల్‌రవీంద్ర తన సిబ్బందితో బ్యాంకు వద్దకు చేరుకున్నారు. ఆందోళన విరమించాలని కోరగా.. సిజిజిబి రీజనల్ మేనేజర్ సిహెచ్ శ్రీనివాస్‌ను పిలిపించి స్పష్టమైన హామీ ఇస్తేనే విరమిస్తామని బాధితులు, నాయకులు పట్టుబట్టారు. అనంతరం అక్కడికి వచ్చిన రీజినల్ మేనేజర్ మాట్లాడుతూ అప్రైజర్‌గా ఉన్న నాగార్జున పథకం ప్రకారమే రెండు కిలోల ఖాతాదారుల బంగారాన్ని తనకు అనుకూలమైన బినామీ ఖాతాల్లో ఇదే బ్రాంచిలో తనఖా పెట్టాడని, ఖాతాదారుల బంగారం మొత్తం ఇదే బ్రాంచిలో ఉన్నట్లు అంచనాకు వచ్చామని వివరించారు. అతని మీద, అతనికి సహకరించిన బ్యాంకు సిబ్బందిపైనా శాఖపరమైన చర్యలకు సిఫారసు చేశామన్నారు. విచారణ నేపథ్యంలో పరిశీలన కౌంటర్లను పెంచి త్వరలోనే మొత్తం ఖాతాదారుల్లో ఎంతమంది బంగారం లేకుండా పోయిందో తెలుస్తామని చెప్పారు. ఖాతాదారుల బంగారం ఒక గ్రామం కూడా నష్టం జరగకుండా పూర్తి బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. పరిశీలనలో బంగారం లేకుండా పోయినట్లు గమనించిన ఖాతాదారులకు బ్యాంక్ మేనేజర్ సంతకంతో కూడిన రసీదును ఇస్తామని, బంగారం లేకుండా పోయిన మొత్తం రైతులను గుర్తించి ఎవరికైనా అనుమానాలుఉంటే వారందరి దరఖాస్తులను పరిశీలిస్తామని అన్నారు. డబ్బులు చెల్లించినా బంగారం, రసీదు ఇవ్వకుండా ఉన్నటువంటి ప్రత్యేకమైన ఖాతాలను పూర్తిస్థాయిలో విచారణ చేస్తామని తెలిపారు. బినామీ ఖాతాదారులపైనా చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో బాధితులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సంజీవరావు, పి.ఆంజనేయులు, పెద్ద శ్రీనివాసరావు, జి.సుభాని, పి.నాగరాజు, రామకృష్ణారెడ్డి, అంజిరెడ్డి, అంకిరెడ్డి, లక్ష్మీనారాయణ, నటరాజు పాల్గొన్నారు.

గెలుపునకు అవసరమైన ఒక్క అవకాశాన్నీ వదలొద్దు

- వైసిపి శ్రేణులకు విజయసాయిరెడ్డి పిలుపు
- మంత్రులు, ఎమ్మెల్యేలతో విడివిడిగా అంతర్గత సమావేశం
- టిడిపి కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గొడవలు జరక్కుండా సంయమనం పాటించాలని సూచన

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా



విజయసాయిరెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి, నాయకులు

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటకు బుధవారం తొలిసారిగా వచ్చిన రాజ్యసభ సభ్యులు, వైసిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, పల్నాడు జిల్లా రీజినల్ కో-ఆర్డినేటర్ విజయసాయిరెడ్డికి ఆ పార్టీ నాయకులు, శ్రేణుల నుండి ఘన స్వాగతం లభించింది. వైసిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నరసరావుపేట-చిలకలూరిపేట రోడ్డులో ఘన స్వాగతం పలికారు. పట్టణంలోకి ప్రవేశించిన విజయసాయిరెడ్డి ప్రకాష్ నగర్ రిక్షా సెంటర్‌లో టంగుటూరి ప్రకాశం జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విజయసాయిరెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలోనే మొట్ట మొదటి బారిష్టర్ పట్టా పొందిన వ్యక్తి టంగుటూరి ప్రకాశం పంతులని కొనియాడారు. అనంతరం ఎ1 కన్వెన్షన్‌లో పల్నాడు జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలతో అంతర్గతంగా సమావేశమయ్యారు. విజయసాయిరెడ్డి పర్యటన రెండ్రోజులుంటుందని వైసిపి వర్గాలు తెలిపాయి. మొదటి రోజు జిల్లాలోని 7 నియోజకవర్గాల పరిధిలో ఉన్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నియోజకవర్గ పరిశీలకులతో సమావేశమయ్యారు. రెండో రోజైన గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో నియోజకవర్గాల వారీగా సమీక్షిస్తారని తెలిసింది. సంక్షేమ పథకాలు, పార్టీ స్థానిక పరిస్థితులు గురించి విజయసాయిరెడ్డి చర్చించనున్నారు. ఇటీవల పల్నాడు జిల్లాలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర నిర్వహించడం, ప్రస్తుతం విజయసాయిరెడ్డి సమీక్షలు రాజకీయంగా ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఆయనకు స్వాగతం పలికిన వారిలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, పౌడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, ఎంపిపి ఎం.శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి పి.చిట్టిబాబు, వైసిపి ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

పల్నాడు జిల్లాలో 2024లోనూ వైసిపి జెండా ఎగరేయాలని విజయసాయిరెడ్డి అన్నారు. జిల్లాలోని 7 నియోజకవర్గాల నాయకులతో ఎ1 కన్వెన్షన్‌లో విడివిడిగా సమావేశమైన అనంతరం అందరితోనూ ఉమ్మడిగా సమావేశం నిర్వహించారు. దీనికి జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో పార్టీ చాలా బలంగా ఉందని, 2019లో జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకుందని, అదే ఫలితాలను మళ్లీ రాబట్టాలని అన్నారు. ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, రాజకీయంగా అన్ని వర్గాలకూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పదవులివ్వడంతోపాటు అధికారానికి దూరంగా ఉన్న సామాజిక తరగతులకూ రాజకీయ ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఈ విషయాలను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని, పార్టీ సంస్థాగత నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఎన్నికల్లో టిడిపి గెలవలేక అనేక కుట్రలను చేస్తుందని, వీటిపట్ల నాయకులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. గొడవలు పెట్టి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలు చేస్తున్నారని, కార్యకర్తలు సంయమనం పాటించేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ గెలుపుకు అవసరమైన ఏ ఒక్క అవకాశాన్ని వదలొద్దన్నారు. సమావేశంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, నంబూరు శంకర్‌రావు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారులతో కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు సరిగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. మండల ప్రత్యేకాధికారుల దినోత్సవం సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో కలెక్టర్ బుధవారం సమీక్షించారు. ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వివిధ ప్రాంతాలు, పాఠశాలలు, హాస్టళ్లు, వసతులపై పరిశీలించిన అంశాలు, సమస్యలు, పరిష్కరించిన అంశాలపై చర్చించారు. పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు ఏ ఇబ్బందీ లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి సంబంధించిన అంశాలపై 15 రోజుల్లో మార్పులను తీసుకురావాలని ఆదేశించారు.



దుగ్గిరాలలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఈమని అప్పారావు తదితరులు



తుళ్లూరు సమావేశంలో మాట్లాడుతున్న ఎం రవి, వేదికపైన ఎం భాగ్యరాజు తదితరులు

ప్రస్తుత రాజకీయ పరిణామాలపై గుంటూరులో రేపు సభ

హాజరు కానున్న సిపిఎం జాతీయ నేత బివి రాఘవులు

జయప్రదం చేయాలని సిపిఎం, ప్రజాసంఘాల నాయకుల ప్రచారం

25 ఉదయం పెదనందిపాడులో తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - తుళ్లూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రస్తుత రాజకీయ పరిణామాలపై సిపిఎం గుంటూరు జిల్లా కమిటీ అధ్వర్యంలో ఈ నెల 25న గుంటూరు వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే సభలో రాజధాని ప్రాంత ప్రజలు పెద్దయెత్తున పాల్గొనాలని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి పిలుపు నిచ్చారు. బుధవారం రాజధాని ప్రాంతం తుళ్లూరు లోని ప్రజాసంఘాల కార్యాలయంలో పేరం బాబూరావు అధ్యక్షతన సిపిఎం విస్తృత సమావేశంలో రవి మాట్లాడారు. 25న సాయంత్రం మూడు గంటలకు జరిగే సభలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు, గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు తదితరులు పాల్గొని ఉపన్యసిస్తారని చెప్పారు. రాష్ట్రానికి, అమరావతి రాజధానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందని అన్నారు. రాజధాని అభివృద్ధికి ఎనిమిది బడ్జెట్లలో ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించకుండా రాజధాని ప్రజలను కేంద్ర ప్రభుత్వం దగా చేసిందని అన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీ చట్టాలను అమలు చేయకుండా తుంగలో తొక్కిందని అన్నారు. ప్రజలపై భారాల మీద భారాలు వేస్తూ మరో ప్రక్క కార్పోరేట్ శక్తులకు మాత్రం రాయితీలు కల్పిస్తూ, లాభాలను తెస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను సైతం వారికి కారు చౌకగా బిజెపి ప్రభుత్వం ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని కోరారు. సమావేశంలో సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం భాగ్యరాజు,పా బత్తుల వెంకటేశ్వరరావు, రాములు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక నిత్యజీవితాసర సరుకుల ధరలు పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు తెలిపారు. బుధవారం దుగ్గిరాల మండలం తుమ్మపూడిలో సిపిఎం నాయకులు మన్నవ నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పోరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నారన్నారు. ఎల్ఐసి, జిఐసి, రైల్వేలు టెలికాం ఇతర ప్రకృతి వనరులను సైతం అంబాని ఆదానీలకు కట్టబెడుతున్నారన్నారు. మండల కార్యదర్శి జెట్టి బాలరాజు మాట్లడుతూ ఆగస్టు 25 న గుంటూరులో జరిగే సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఎం గ్రామ కార్యదర్శి ఎం నరసింహారావు, బి చిరంజీవి, ఎం ఇందిర, బి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలి

కేంద్రంలోని బిజెపి సర్కార్ ప్రధాని మోది నేతృత్వంలో రాజ్యాంగ వ్యవస్థకు తూట్లు పొడుస్తోందని, దీనిని ప్రజలు తిప్పికొట్టాలని సిపిఎం సీనియర్ నాయకులు ములకా శివసాంబిరెడ్డి పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి, ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితులపై 25న గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే సభను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం కొల్లిపర మండలం అత్తలూరివారిపాలెం, వల్లభాపురంలో పర్యటించారు. ప్రభుత్వాలు ఆమలు చేస్తున్న రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలపై సభలో సీపిఎం పోలిట్‌బ్యూరో సభ్యులు జెవి రాఘవులు ప్రసంగిస్తారని, సభకు వివేషంగా తరలి రావాలన్నారు. కార్యక్రమంలో అత్తోట వీరయ్య, కొలకలూరి కృష్ణ, గొడవర్తి రామారావు, కనపాల రోశయ్య, షడ్రక్, వల్లభాపురం సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

25వ తేదీ మధ్యాహ్నం గుంటూరు వెంకటేశ్వరా విజ్ఞాన మందిరంలో ప్రస్తుత రాజకీయ పరిణామలపై నిర్వహించే సభను జయప్రదం చేయాలని సిపిఎం పొన్నూరు మండల శాఖ సహాయక కార్యదర్శి నిమ్మకూరు రమేష్ బాబు పిలుపునిచ్చారు. పొన్నూరులో ప్రచారం నిర్వహించారు.

ప్రజాశక్తి - తాడికొండ

దేశ ప్రజలను ముక్కలు చేసే బిజెపికి బుద్ధి చెప్పండని సిపిఎం గుంటూరు జ ఇల్లా కమిటీ సభ్యులు కంచుమాటి ఆజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం తాడికొండలో నాయకులు చింతల భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించిన సిపిఎం విస్తృత సమావేశంలో ఆయన ప్రసంగించారు. 25న గుంటూరులో ప్రస్తుత రాజకీయ పరిణామలపై జరగనున్న సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కనకాల పూర్ణచంద్రరావు, బానావతి భద్రయ్య, కె రాజు సత్యన్నారాయణ, షేక్ సుబాని తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న రమేష్‌బాబు

రేపు తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం ప్రారంభం


జయప్రదం చేయాలని పలు గ్రామాల్లో విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - పెదనందిపాడు : 25వ తేదీన ఉదయం 10గంటలకు పెదనంది పాడులో తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం ప్రారంభ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞాన కేంద్రం కన్వీనర్ దొప్పలపూడి రమేష్‌బాబు, కో కన్వీనర్ కాకుమాను నాగేశ్వరరావు కోరారు. బుధవారం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ పెదనందిపాడు, కాకుమాను మండలాల్లో ఆటో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు విజ్ఞాన కేంద్రాన్ని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రారంభింస్తారని తెలిపారు. పెదనందిపాడు ప్రాంతంలో అభ్యుదయ భావజాలాన్ని ప్రచారం చేయడానికి తేళ్ల నారాయణ పేరుతో, అనేకమంది దాతల సహకారంతో పెదనంది పాడులో విజ్ఞాన కేంద్రాన్ని నిర్మించామని తెలిపారు. అభ్యు దయ కార్యక్రమాల నిర్వహణకు అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా నిర్మాణం జరిగిందనితెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం నిర్మాణ కమిటీ సభ్యులు కుర్రా హరిబాబు, జంపని రామారావు, కొత్త వెంకట శివరావు, చుక్కా యానాదులు, మద్దూరి రమణ, ప్రజాసంఘాల నాయకులు కందుల శ్రీనివాసరావు, దేవరకొండ శ్రీనివాసరావు, తెలగతోటి రామరాజు పాల్గొన్నారు.

యానిమేటర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి-తెనాలి

యానిమేటర్ల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించాలని యానిమేటర్ల ఉద్యోగ సంఘం సిఐటియూ జిల్లా గౌరవాధ్యక్షులు దండా లక్ష్మినారాయణ డిమాండ్ చేశారు. బుధవారం తెనాలిలో అరుణ అధ్యక్షతన నిర్వహించిన యానిమేటర్స్ మండల సమావేశం లో దండా లక్ష్మీనారాయణ మాట్లాడారు. యాని మేటర్లకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, వారి ఖాతాల్లో నేరుగా జమచేయాలని, యానిమేటర్లకు పెట్టిన మూడేళ్ళ కాలపరిమితి, 45 సంవత్సరాల వయోపరిమితి తక్షణమే రద్దు చేయాలన్నారు. పొదుపు సంఘాల్లో జరిగే ప్రతి పొరపాటుకు యానిమేటర్లనే భాధ్యులను చేయటం, వారిపై రాజకీయ వేధింపులు సరికాదన్నారు. అలాగే యానిమేటర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని, అర్హతలను బట్టి వారికి సిసిలుగా పదోన్నతి కల్పించాలన్నారు. ఈనెల 30 వరకూ జరిగే జీపు జాతాలను జయప్రదం చేయాలని యానిమేటర్లను ఆయన కోరారు. సమస్యలపై వినతి పత్రాన్ని ఎంపిడివో



యానిమేటర్లతో దండా లక్ష్మినారాయణ, సాంబిరెడ్డి, హుస్సేన్‌వలి

ఎల్ విజయాలక్ష్మణ్, ఏపిఎం కె.జయశ్రీలకు అందించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ములకా శివసాంబిరెడ్డి, షేక్ హుస్సేన్‌వలి పాల్గొన్నారు.

యానిమేటర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

యానిమేటర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని సమావేశంలో ఎన్నుకున్నారు. తెనాలి అధ్యక్ష, కార్యదర్శులుగా అరుణకుమారి, హనుమాయమ్మ, కోశాధికారిగా ఎం.సత్యవతి, ఉపాధ్యక్షులుగా పూర్ణ కుమారి, శశికళ, సంఘం గౌరవాధ్యక్షులుగా షేక్ హుస్సేన్‌వలిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ముఖ్యమంత్రి హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

పారిశుధ్య కార్మికులకు సిఎం జగన్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, బూరుగ వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం తాడేపల్లి పట్టణంలోని వివిధ మస్టర్ పాయింట్ల వద్ద జరిగిన మున్సిపల్ కార్మికుల గ్రూపు సమావేశాల్లో ఆయన మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు దాటినా హామీలు అమలుకు నోచుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. 24న చలో విజయవాడ కార్యక్రమానికి మున్సిపల్ కార్మికులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సంతోషం, వెంగమ్మ, కొండయ్య, సతీష్, శ్యామ్, రమణ, రాంబాబు, సీమోన్ పాల్గొన్నారు.



ధర్నా విరమించినా నోటీసులు

ప్రజాశక్తి-గుంటూరు :విద్యారంగ సమస్యల పరి ష్కారానికి ఫ్యాప్టో బుధ వారం విద్యా శాఖ కమిషనరేట్ వద్ద తలపెట్టిన ధర్నాను విరమిసు_న్నట్లు నేతలు ప్రకటించినా ప్రభుత్వం బెదిరింపులు ఆప లేదు. పోలీసులు మంగళ వారం రాత్రి జిల్లాలోని పలువురు నాయ కులకు ధర్నాకు వెళ్లొద్దని నోటీసులు అందచేశారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ యం.కళాధర్‌కు, యుటిఎఫ్ చేబ్రోలు మండల ప్రధాన కార్యదర్శి డి.నాగేశ్వరరావుకు, మంగళగిరి నాయకులు ఏడుకొండలు, జిల్లాలో పలు ప్రాంతాల్లో నాయకులు నోటీసులు ఇచ్చారు. ధర్నా విరమించుకున్నా నిర్బందం ప్రయోగించటం సరికాదని కళాధర్ అన్నారు. పెండింగ్ జీతాలు చెల్లించాలని, ఓపిఎస్ అమలు చేయాలని, ఉపాధ్యాయులపై వేధింపులు ఆపాలని ధర్నాకు పిలుపునివ్వగా మంత్రితో జరిగిన చర్చల్లో సమస్య పరిష్కారానికి హామీ లభించటంతో ధర్నా విరమించినట్లు చెప్పారు. అయితే పోలీసులు అర్ధరాత్రి వేళ నాయకులు ఇళ్లకు వచ్చి నోటీసులు ఇచ్చి భయభ్రాంతులకు గురి చేశారని అన్నారు.



కళాధర్‌కు నోటీసు ఇస్తున్న పోలీసు

మినరల్ వాటర్ కూలర్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి చిన్న పిల్లల వార్డు సమీపంలో మినరల్ వాటర్ కూలర్‌ను బుధవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ చిన్న పిల్లల వార్డు సమీపంలో మంచి నీరు లేకపోవడంతో రోగుల సహాయకులు ఇబ్బందులు పడుతున్నారన్న విషయాన్నీ దాతకు చెప్పగానే సమాకూర్చారని ఆయన చెప్పారు. రూ.50 వేల విలువ గల కూలర్‌ను మూడు సార్లు ఇవ్వడం సంతోషకరమని ఆయన చెప్పారు. కార్యక్రమంలో బసవ పున్నయ్య తనయుడు పట్టపు గోపి, సివిల్ సర్జన్ ఆర్ఎంఒ డాక్టర్ సతీష్ కుమార్, డాక్టర్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

దాతల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి :ఆసుపత్రి అభివృద్ధికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. కృష్ణా జిల్లా తిరువూరు కు చెందిన సి హెచ్ రామకృష్ణ రోడ్డు ప్రమాదంలో గాయపడి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి లో జూన్ 11 వ తేదీన చేరారు. అర్ధోపెడిక్ మూడో యూనిట్ ప్రొఫెసర్ డాక్టర్ అద్దేపల్లి శ్రీనివాస రావు వైద్య బృందం శస్త్ర చికిత్స చేసి డిశ్చార్జి చేశారని చెప్పారు. దానికి కృతజ్ఞతగా రామకృష్ణ కుటుంబ సభ్యులు బుధవారం రూ.80 వేల విలువ గల ఆర్ధో పెడిక్ విభాగానికి అవసరమైన పరికరాలను ఆసుపత్రికి అందచేశారని ఆయన చెప్పారు. పేషంట్ ప్రభుత్వ ఉద్యోగి కావడంతో ఈ హెచ్ ఎస్ కింద ఉచితంగా వైద్యం అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ రవి, డాక్టర్ జ్యోసనా, డాక్టర్ హేమ, డాక్టర్ సంతోష్, డాక్టర్ ఋషికేష్, డాక్టర్ విష్ణు, డాక్టర్ అద్విన్, డాక్టర్ ధర్మ నాయక్, పాల్గొన్నారు.

జీవో 21 రద్దు కోసం చలో రాజ్‌భవన్



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గుంటూరు :రవాణా రంగ కార్మికుల మెడపై కత్తిలా ఉన్న జిఒ 21 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 6న చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు గుంటూరు తూర్పు కమిటీ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస రావు పిలుపు నిచ్చారు. బి.ఆర్.స్టేడియం ఆటోస్టాండ్ విసృత సమావేశం బుధవారం వేజెండ్ల క్వారీ వద్ద నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ మోటార్ వాహన చట్ట సవరణ డ్రైవర్లకు, రవాణా రంగం కార్మికులకు నష్టం కలిగిస్తుందన్నారు. చట్ట సవరణపై దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేయటంతో కేంద్రం కుట్ర పూరితంగా రాష్ట్రాల ద్వారా చట్ట సవరణలో ప్రతిపాదించిన ప్రమాదకరమైన అంశాలను అమలు చేయించేందుకు సిద్ధం అయ్యిందని విమర్శించారు. కాగా అన్ని రాష్ట్రాల కంటే ముందుగా ఏపీలో అమలు చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం జిఒ 21 తెచ్చి, పెద్ద ఎత్తున డ్రైవర్లపై భారాలు వేయటంతోపాటు, చిన్న చిన్న కారణాలకూ డ్రైవర్లకు పెద్ద స్థాయిలో శిక్షలు వేసే విధంగా జీఒ తేవటం అన్యాయమన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.కె మస్తాన్‌వలి నాయకులు ఎస్.కె ఖాసింషహీద్ ప్రసంగించారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.కె సమీవుల్లా ప్రభుదాస్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో షబ్బీర్, చిన్న, ఖాసిం ,శ్రీనివాసరావు, మౌలాలి పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు సత్వర చర్యలు

ప్రజాశక్తి-పెదకూరపాడు

జగనన్న కాలనీ లేఔట్లలో మౌలిక వసతుల కల్పనకు సత్వర చర్యలు తీసుకోవాలని సిబ్బందిని జిల్లా కలెక్టర్ శివ శంకర్ ఆదేశించారు. బుధవారం మండలంలోని బలుసు పాడులో జగనన్న లేఅవుట్‌ను ఆయన పరిశీలించారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు, మిగతా శాఖల అధికారులను సమన్వయ పరుచుకోవాలని అన్నారు. కాలనీలో విద్యుత్తు పనులు, తాగునీటి వస˘తులపై జరుగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. కార్య క్రమంలో గృహ నిర్మాణ శాఖ డిఇఇ వెంకటేశ్వరావు,మండల స్పెషల్ ఆఫీసర్ ధనలక్ష్మి, తహశీల్దార్ క్షమారాణి, మండల అభివృద్ధి అధికారి నర సింహారావు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలు నిర్వహించాలి

విద్యార్థులకు క్విజ్ పోటీలు, విద్యార్థులకు గ్రూపు చర్చలు నిర్వ హించాలని ఉపాధ్యాయులకు కలెక్టర్ శివ శంకర్ సూచించారు. మండలం లోని తాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులను పలు ప్రశ్నలు వేశారు. అనంతరం పాఠశాలలోని ల్యాబ్ ను ఆయన పరి శీలించారు. కలెక్టర్ వెంట మండల విద్యాశాఖ అధికారులు ప్రసాదరావు, సత్యనారాయణ, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

అంగన్వాడీలకు నూతన యూనిఫాం పంపిణీ

మండలంలోని తాళ్లూరులో అంగన్వాడీ కార్యకర్తలకు నూతన యూని ఫాంను కలెక్టర్ శివశంకర్ పంపిణీ చేశారు.



బలుసుపాడులో జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

వచ్చే నెల నుండి అంగన్వాడీ టీచర్లకు కొత్త యూనిఫామ్‌ను ప్రభుత్వం రూపొందించింది. ఆ యూనిఫాంనే వారు ధరించాల్సి ఉంటుంది. కార్యక్రమంలో సిడిపిఒ స్వర్ణకుమారి, సూపర్‌వైజర్ మున్ని పాల్గొన్నారు.

ద్రావిడ యూనివర్సిటీ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా కోటేశ్వరరావు

ప్రజాశక్తి - వినుకొండ



కుప్పంలోని ద్రావిడ యూనివర్సిటి కౌన్సిల్ న్యాయవాదిగా వినుకొండకు చెందిన ముత్తినేని కోటేశ్వరరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 282ను జారీ చేసింది. వినుకొండ నియోజకవర్గం పెదకంచెర్లకు చెందిన కోటేశ్వరరావు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి న్యాయ శాస్త్రంలో పట్టభద్రులయ్యారు. హైకోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తూ రాష్ట్ర పట్టణ మౌలిక సదుపాయాల కల్పన అభివృద్ధి సంస్థ (ఏపీ టిడ్కో) స్టాండింగ్ కౌన్సిల్‌గా, జిల్లా పరిషత్, మండల పరిషత్, పంచాయతీ, శాఖలకు స్టాండింగ్ కౌన్సిల్‌గా విధులు నిర్వహించారు. తాజా నియామకంపై ఆయన సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కోటేశ్వరరావుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.



ఓటర్ల సర్వేపై రాజకీయపార్టీల సమావేశం

ప్రజాశక్తి-పెదకూరపాడు

చట్ట ప్రకారం మాత్రమే ఓటర్ సర్వే జరుగుతోందని పెదకూరపాడు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ రామచంద్రరావు అన్నారు. బుధవారం పెదకూరపాడు తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ ఓటర్ల సర్వేపై రాజకీయ పార్టీల సమావేశం జరిగింది. రాజకీయ పార్టీల నాయకులు సర్వే చేయకుండానే ఫారం-7 దరఖాస్తు చేస్తున్నారని, నిర్దిష్టంగా తన దృష్టికి తీసుకురావాలని ఆర్వో అన్నారు.



అంగన్వాడీల రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - వినుకొండ

ఈ నెల 27వ తేదీన విజయవాడ మొగల్రాజ పురంలోని సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలోజరిగే అంగ న్వాడీల రాష్ట్ర సదస్సుకు తరలిరావాలని అంగ న్వాడి వర్కర్స్ యూనియన్ వినుకొండ సెక్టార్ కార్యదర్శి ఎం. సారమ్మ కోరారు. ఈ మేరకు వాల్‌పోస్టర్‌ను పట్టణం లోని కోటనల్సా అంగన్వాడీ కేంద్రంలో బుధవారం ఆవిష్క రిం చారు. కార్యక్రమంలో ఎస్కే మున్న, ఎస్కే షకీలా, పద్మ, మరియమ్మ, సుచరిత, ఎస్కే ఆసియా, రంజాన్‌బి పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు రూ.5,000 అందజేత

ప్రజాశక్తి-బెల్లంకొండ

మండలంలోని మాచర్లపాలెంలోని గౌరు నారాయణ భార్య గౌరు రత్నమ్మ మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని మాచాయపాలెం గ్రామ తెలుగుదేశం పార్టీ . మాజీ ఎంపీటీసీ గుడిసె కొండయ్య అన్నారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యం కారణంగా చికిత్స పొందుతున్న గౌరు రత్నమ్మ(22) మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ విషయం తెలుసుకున్న పెదకూరపాడు మాజీ శాసనసభ్యులు కొమ్మాలపాటి శ్రీధర్, నారాయణతో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. పార్టీ పరంగా ఆ కుటుంబానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. మట్టి ఖర్చుల నిమిత్తం శ్రీధర్ సహకారంతో మాచాయ పాలెం గ్రామ మాజీ ఎంపిటిసి గుడిసె కొండయ్య ఆధ్వర్యంలో ఆ కుటుంబానికి రూ.5,000 వేలు అందజేశారు.

పిల్లలందరూ మధ్యాహ్న భోజనం తినాలి

ప్రజాశక్తి-పెదకూరపాడు

మధ్యాహ్న భోజనాన్ని పాఠశాలలోని పిల్లలందరూ తినే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి ధనలక్ష్మి అధికారులకు సూచించారు. బుధవారం పెదకూరపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆమె తనిఖీ చేశారు. అందుకు పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట పెదకూరపాడు మండల విద్యాశాఖ అధికారులు ఏకుల ప్రసాదరావు, సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకాని వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఈపూరు

జెడ్‌పి పాఠశాలను మండల ప్రత్యేక అధికారిణి ఎస్. వరలక్ష్మి బుధవారం సందర్శించారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్నం భోజనాన్ని విద్యార్థులకు ఎంపీడీవో ఏవి రంగనాయకులు, ఎంఈఓ రామతులసితో కలిసి ఆమె వడ్డించారు. ఆహారంలో అందించే గుడ్డు సైజును పరిశీలించారు. కూరలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి అధికారులు భోజనం చేశారు. విద్యార్థులకు ఐరన్ మాత్రలు పంపిణీపై ఆరా తీశారు. వారితోపాటు ప్రధానోపాధ్యాయులు రామకష్ణారెడ్డి ఉన్నారు.



పెదకూరపాడు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలు తీరును తనిఖీ చేస్తున్న ప్రత్యేక అధికారిణి ధనలక్ష్మి



ఈపూరులో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ప్రత్యేక అధికారిణి వరలక్ష్మి



ఎపిఆర్‌జెసికి 60 సీలింగ్ ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి - విజయపురిసౌత్

స్థానిక ఏపీఆర్జేసి కి కళాశాల పూర్వ విద్యార్థి రిటైర్డ్ ఛీఫ్ ఇన్కమ్ టాక్స్ కమిషనర్ పురుషోత్తం బుధవారం 60 సీలింగ్ ఫ్యాన్ లను ప్రిన్సిపాల్ సరోజినికి అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు కళాశాలలో మౌళిక సదుపాయాలు,విద్యార్థుల రూమ్స్ రిపేర్లు, కిచన్ సామాన్లు సమకూర్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొ న్నారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శఖరాలకు చేరుకోవాలని చెప్పారు. కళాశాలకు మంచి పేరు ప్రఖ్యా తులు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సాగర్ పరివార్ కార్యదర్శి డాక్టర్ వీరనంది, ఉపాధ్యక్షుడు సైదారెడ్డి, జయింట్ సెక్రటరీ డాక్టర్ రాజేశ్వర్, ఎన్నారై కన్వీనర్ శేషు, గొంతిన రమేష్, అధ్యాపకులు చందు అంజనేయులు, చంద్రశేఖర్, లింగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఏ వర్గానికి కొమ్ము కాయాల్సిన అవసరం లేదు

- టిడిపి సానుభూతిపరుడు పేరం జగ్గారెడ్డి మృతి ఘటన ప్రస్తావన
- రాజీ కుదిర్చామనే ప్రకటన సత్య దూరం
- వార్తలు రాసే ముందు వివరణ తీసుకోండి
- గురజాల డిఎస్పి ఎ. పల్లపు రాజు

ప్రజాశక్తి-రెంటచింతల

బిఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం, భారత శిక్షా స్మృతి మాత్రమే అమలులో ఉన్నాయని, యూనిఫారం ధరించిన పోలీసుల దృష్టిలో అంతా ఒకటేనని, తాము ఏ వర్గానికి కొమ్ము కాయాల్సిన అవసరం లేదని గురజాల డిఎస్పి పల్లపురాజు అన్నారు.బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 20న రెంటాలలో తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుడు పేరం జగ్గారెడ్డి మృతి చెందిన ఘటన గురించి ప్రస్తావిస్తూ, మాచర్ల టిడిపి ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి 18 వాహనాలతో కాన్వాయ్‌గా రావడంతో పొలిమేరలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఆరోజు సాయంత్రం అయ్యేసరికి గొడవలు జరిగాయని, గురజాల పోలీసులు బాధితుడు సర్వారెడ్డికి రక్షణ కల్పించి, అతని ఫిర్యాదు మేరకు ఆరు గురుపై కేసులు నమోదు చేశామన్నారు. సర్వారెడ్డి భార్య అన్నపూర్ణమ్మ తమకు కేసులు వద్దని, అందరం బంధువులమవుతామని చెప్పారని, రాజీ చేయాలని వారు కోరగా లోక్ అదాలత్‌లో పెట్టి సఖ్యతగా పరిష్కరించకుంటున్నామన్నారని



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గురజాల డిఎస్పి ఎ.పల్లపు రాజు

చెప్పారు. అంతేగాని, ఈ వ్యవహారంలో పోలీసుల బలవంతం ఏమీ లేదని డిఎస్‌పి స్పష్టం చేశారు. పోలీసు అధికారుల సమక్షంలో కేసులకు సంబంధించి రాజీ కుదిర్చాము అనే ప్రకటన సత్య దూరం అని, బాధిత కుటుంబాల వారు దాడులు చేసిన వారు రాజకీ వస్తే తాము చేయగలిగింది ఏమీ లేదు లోక్ అదాలతో పెట్టి రాజీ చేస్తామని అన్నారు. పత్రికలకు పూర్తి స్వేచ్ఛ ఉంటుందని, అయితే వార్తలు రాసే ముందు తమ వివరణ తీసుకుంటే బాగుండేదని డిఎస్‌పి అభిప్రాయ పడ్డారు.

వందమంది అల్లరి మూకలు రెచ్చిపోయి హింసకు పాల్పడితే పది మంది పోలీసులు శాంతి భద్రతలు కాపాడతారని, అదే వెయ్యి మంది దౌర్జన్యం చేస్తే ఉన్న కొద్ది మంది పోలీసులు సంయమనం పాటిస్తారని, ఆ తర్వాత చట్టం తన పని తాను చేసుకుపోతుందని అన్నారు. గత నెల పదిన ఉప్పలపాడు నర్సరీలో గడ్డి మందు చల్లి నర్సరీకి నష్టం చేసిన ఘటన గురించి ఆయన ప్రస్తావించారు. సర్వారెడ్డితో పాటు వెన్న శ్రీనివాస్ రెడ్డి నిందితుడని చెప్పారు. సమా వేశంలో సిఐ దార్ల జయకుమార్, ఎస్సై శామ్యూల్ రాజీవ్ కుమార్ పాల్గొన్నారు.

ఆచార్య సిఆర్ రావుకు నివాళి

ప్రజాశక్తి - ఎఎన్‌యు



ప్రఖ్యాతి గాంచిన గణిత , గణాంక శాస్త్ర వేత్త కైలెం పూడి రాధాకృష్ణారావు బుధ˘వారం తెల్లవారుజామున ఆకస్మిక మృతి చెందడం పై విశ్వవిద్యాలయ గణాంక శాఖ ఆచార్యులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘన నివాళులు అర్పించారు. ఈ సంద ర్భంగా విశ్వవిద్యాలయ గణాంక శాఖ విభాగాధిపతి ఆచార్య బి .సత్యనారాయణ మాట్లాడుతూ వర్తమాన భవిష్యత్ తరాల గణిత గణాంక శాస్త్ర విద్యార్థులకు ఎంతో మందికి ఆయన ఆదర్శనీయుడని కొనియాడారు. పూర్వప్రాచార్యులు ఆచార్య విక్టర్ బాబు, ఆచార్య చందన్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధమైన సంఘటన బుధవారం మాచర్ల మండలం విజయపురిసౌత్ లో చోటు చేసుకుంది. డౌన్ మార్కెట్ కు చెందిన గరికెన నాగేశ్వరరావు ఊరికి వెళ్లాడు. అతని కొడుకు కాశిబాబు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. స్థానికులు హుటాహుటిన ఇంటి వద్దకు చేరుకుని మంటలు ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లో ఉన్న డబ్బులు, వలలు,ఫ్రిడ్జ్, టీవీ, దుస్తులు, సరుకులు, వంటసామగ్రి కాలి బూడిదయ్యాయి. సుమారు 2 లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. విషయం తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ శేరెడ్డి గోపిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని దగ్ధమైన ఇల్లును పరిశీలించారు. బాధితులకు నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



ఈ-ఆటోలు ప్రారంభం

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణానికి స్వచ్ఛభారత్ కింద ఈ ఎలక్ట్రానిక్ ఆటోలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమాన్ని బుధవారం పొన్నూరు మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ ప్రారంభించారు. ఈ ఆటోల ద్వారా తడి,పొడి చెత్త, ఘన .ఎలక్ట్రికల్ వ్యర్థాలను విడివిడిగా సేకరించేందుకు ప్రభుత్వం ఈ ఆటోలను విడుదల చేసినట్టు ఆయన చెప్పారు. ప్రజలు తడి,పొడి చెత్తను విడివిడిగా చేసి అందించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామాల్లో దొంగతనాలను అరికట్టండి

ప్రజాశక్తి-తెనాలి

తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా గ్రామాల్లో జరుగు తున్న దొంగతనా లను పోలీ సులు అరికట్టాలని సిపిఎం సీని యర్ నాయకులు ములకా శివ సాంబిరెడ్డి కోరారు. రూరల్ గ్రామం కంచర్లపాలెంలో రెండు ఇళ్ళలో జరిగిన దొంగతనాలు జరిగిన నేపథ్యంలో బుధవారం ఆ గ్రామంలో ఆయన పర్యటించి, వివరాలను వెల్లడించారు. హైదరాబాద్‌లో ఉ ంటున్న సోమేపల్లి శారద, 40 రోజుల క్రితం అమెరికా వెళ్ళిన చుక్కపల్లి అభయ ప్రదాంబ ఇళ్ళలో దొంగలు పడి, పలు రకాల వస్తువులు దొంగిలించారన్నారు. వేసిన తాళం వేసి నట్టే ఉందని, దొంగలు ఇంటి వెనుక నుంచి ప్రవేశించి దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. పోలీసులు రాత్రివేళ రూరల్ గ్రామాల్లో గస్తీ నిర్వహించాలని కోరారు.

వృద్ధురాలికి నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి



స్థానిక టిప్పర్ల బజారుకు చెందిన పేద వృద్ధురాలు బి.వెంకాయమ్మకు బుధవారం ఎమ్మెల్యే ఆర్కే సహకారంతో వైసిపి నాయకులు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మునగాల మల్లేశ్వరరావు, ఎండి ఫిరోజ్, సంకే సునీత, ఎం.సుధారాణి, బి.నర్సయ్య, ఎ.రాజేష్ పాల్గొన్నారు.



నియామకపత్రాలను అందిస్తున్న సాధుప్రతాప్

ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కిషోర్

ప్రజాశక్తి-తెనాలి

ఆర్యవైశ్య రాష్ట్ర యువజన సంఘం ఉపాధ్యక్షులుగా పట్టణానికి చెందిన ఎంవికె కిషోర్ నియమితు లయ్యారు. ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి సాధు ప్రతాప్ కుమార్ ఈ మేరకు నియామక పత్రాలను అందిం చారు. స్థానిక బోస్‌రోడ్డులోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం నిర్వహించిన సభలో ఎంవికె కిషో ర్‌ను సత్కరించారు. ఆర్యవైశ్య సంఘానికి కిషోర్ చేసిన సేవ లకు గుర్తింపుగా ఆయనను రాష్ట్ర ఉపా ధ్యక్షులుగా నియ మించినట్లు సాధుప్రతాప్‌కుమార్ చెప్పారు. అలాగే, ఈసి మెంబర్లుగా కె.పూర్ణానంద్‌కు నియామక పత్రాన్ని ఆయన అందించారు. ఆర్యవైశ్య సంఘీయుల సం క్షేమానికి వారు విస్తృత సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు భాస్క రుని శ్రీనివాసరావు, యువజన సంఘ పట్టణ అద్యక్షులు కొల్లా గురునాథ్‌గుప్తా, వి.శివసుధాకర్, జి.సాయిహరేరామ్ పాల్గొన్నారు.

వర్షంతో.. రహదారి జలమయం

ప్రజాశక్తి-ప్రత్తిపాడు, గుంటూరు

బుధవారం సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల మధ్య కురిసిన వర్షానికి రోడ్లు కాల్వలను తలపించాయి. వర్షపునీరు డ్రైనేజ్ కాల్వ ల్లోకి చేరడంతో మురుగు నీరు లోతట్టుగా ఉన్న ఇళ్లల్లోకి చేరింది. దీంతో, అందులో నివసించే వారు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ప్రత్తిపాడు నుంచి గొట్టిపాడు వెళ్లే రహదారిలోని బ్రిడ్జిపై



నుంచి వర్షపు నీరు ప్రవహించడంతో వాహన దారులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పాఠశాలల నుంచి విద్యార్థులు, కార్యాలయాల నుంచి ఉద్యోగులు తిరిగి ఇంటికే వెళ్లే సమయం కావడంతో వారు కూడా ఇబ్బంది పడ్డారు. గుంటూరు బ్రాడీపేట, ఆర్‌యుబిలో వర్షపు నీళ్లు పొంగి ప్రవహించాయి.



గుంటూరు బ్రాడీపేటలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ

అర్హులెవ్వరూ దూరం కాకూడదు

ప్రజాశక్తి-తెనాలి

ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు అర్హులు ఎవ్వరూ దూరం కాకూడదని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివ కుమార్ అన్నారు. రూరల్ గ్రామం కొలకలూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బుధవారం ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసు కున్నారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు సైడు కాల్వల నిర్మాణం, నివేశన స్థలాల కేటాయింపు వంటి సమ స్యలను ఆయన దృష్టికి తెచ్చారు. అర్జీల రూపంలో ఆయా సమస్యలను సచివాలయాల సిబ్బంది స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నివేశన స్థలాల దరఖాస్తులను పరిశీలించి, రెండు నెలల్లో వారికి స్థలాలు కేటాయిస్తామన్నారు. సైడ్ డ్రెయిన్ల సమస్యలను పరిష్కరిస్తామని, ప్రతి సచివాలయం పరిధిలో ప్రభుత్వం మంజూరు చేసే రూ.20లక్షలకు తోడు, మండల పరిషత్ నిధులతో సైడు



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శివకుమార్

కాల్వలు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి చెన్నుబోయిన శ్రీనివాసరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కోడూరు స్వప్న, ఎంపిటిసి కె.ఫణికుమార్, డి.నాగదేవిక, నాయకులు కొలకలూరి నాగేశ్వరరావు, పినపాటి అనిల్‌కుమార్, పి.బాలగురవమ్మ, బి.బాపిరాజు, శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలోని విఐటి విశ్వవిద్యాలయంలో ఐడిఎస్ (ఇన్ఫర్మేషన్ డేటా సిస్టమ్స్) సహకారంతో బుధవారం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ బ్లాక్ చెయిన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా విఐటి ఫౌండర్, ఛాన్సలర్ డాక్టర్ జి. విశ్వ నాథన్, ఇన్ఫర్మేషన్ డేటా సిస్టమ్స్ వైస్ ప్రెసిడెంట్ అరవింద్ వోరుగంటి, ఇన్ఫర్మేషన్ డేటా సిస్టమ్స్ బిజినెస్ హెడ్ సునీల్ యడవల్లి హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ మాట్లాడుతూ, ఇన్ఫర్మేషన్ డేటా సిస్టమ్స్ సహకారంతో బ్లాక్ చెయిన్‌లో భారతదేశంలోనే మొట్టమొదటి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను రాజధాని అమరావతి లోని విఐటి విశ్వవిద్యాలయంలో స్థాపిం చడం ఆనందంగా ఉందని అన్నారు. సెంటర్ ఆఫ్ ఎక్స లెన్స్‌ను విద్యార్థులు, అధ్యాపకులు సద్వినియోగం చేసుకొని బ్లాక్ చైన్ టెక్నాలజీ రంగంలో నైపుణ్యాలను పెంచు కోవాలని కోరారు. అరవింద్ మాట్లాడుతూ,విఐటి విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా భారత్ బ్లాక్ చైన్ యూనివర్సిటీ ఇండస్ట్రీ క్లస్టర్ (యుఐసి)లో భాగంగా 5 అప్లైడ్ బ్లాక్ చైన్ సెంటర్‌లలో ఒకటని తెలిపారు. అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ల్యాబ్, విద్యా ర్థులు, అధ్యాపకులకు ఆచరణాత్మకంగా,హెడెరా హ్యాష్‌గ్రాఫ్ వినియోగ కేసులను ఉపయోగించి నూతన ఆవిష్కరణలకు వీలు కల్పిస్తుందని చెప్పారు. www.bon.bharat-blockchain.io పోర్టల్ ద్వారా హెడెరా హ్యాష్‌గ్రాఫ్ వినియోగ కేసులను ఉపయోగించుకోవచ్చని చెప్పారు. విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్‌వి కోటారెడ్డి మాట్లా డుతూ, విఐటి -ఏపి విశ్వవిద్యాలయం పరిశోధనలలో ఎల్లప్పుడూ ముందు ఉంటుందని అన్నారు. సునీల్ యడ వల్లి మాట్లాడుతూ, తాను విఐటి పూర్వ విద్యార్థినని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో రమణి బాలసుందరం (ట్రస్టీ, విఐటి-భోపాల్), రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి



సెంటర్ ఆఫ్ ఎక్స లెన్స్ ఇన్ బ్లాక్ చైన్ ను ప్రారంభిస్తున్న చిత్రం

డాక్టర్ ప్రదీప్ రెడ్డి(డీన్,స్కోప్), డాక్టర్ ప్రభా సెల్వరాజ్ (చైర్ ప్రొఫెసర్ అఫ్ బ్లాక్ చైన్ సిఓఈ) పాల్గొన్నారు.

కెఎల్ యు ను సందర్శించిన డాక్టర్ నాగభూషణ్

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

కెఎల్ యు డీమ్డ్ యూనివర్శిటీని విజ్ఞాన్ యూనిర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ నాగభూషణ్ బుధవారం సందర్శించారు. వర్శిటీలో గత మూడు రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ కార్యశాలలో పాల్గొనేందుకుగాను వచ్చిన ఆయన మానవ మెదడులె తలెత్తే సమస్యల యొక్క డేటాను ఎలా అర్థం చేసుకోవాలి, దానికి కంప్యూటర్ ఆల్గారిథమ్‌ను ఎలా అన్వయించాలనే అంశంపె విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2050 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 150 కోట్ల మందికి మెదడుకు సంబంధించిన వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. ఆ సమయానికి మెదడు సమస్యలను త్వరితగతిన గుర్తించడానికి అధునాతన టెక్నాలజీ అవసరమన్నారు. ఈ నేపథ్యంలో కెఎల్ యు అధ్వర్యంలో కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ ప్రోత్సాహంతో జరుగుతున్న అంతర్జాతీయ కార్యశాల ఎంతో అవసరమన్నారు. అనంతరం కెఎల్ యు ప్రో ఛాన్సలర్ డాక్టర్ కెఎస్.జగన్నాథరావు, పరిశోధనలు, అభివద్ధి డీన్ డాక్టర్ జయకుమార్ సింగ్ లు నాగభూషణ్‌ను ఘనంగా సత్క రించారు. వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు పాల్గొన్నారు.



సిమెంట్ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి గ్రామంలో బుధవారం మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ ము రుగుడు హనుమంతరావు తో కలిసి సుమారు కోటి రూపాయల నిధులతో నిర్మాణం అవుతున్న సిమెంటు రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. 7.2 మీటర్ల వెడల్పు, 400 మీటర్లు పొడవు నిర్మాణం జరగనున్న సిమెంటు రోడ్డు మార్కింగ్ పనులను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎలాంటి లోపాలు లేకుండా నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ డిఇ కృష్ణారెడ్డి, వైసిపి నాయకులు నూతక్కి శ్రీనివాసరావు, అమరా నాగయ్య, మిరి యాల రాంబాబు, కూరపాటి సాంబిరెడ్డి, చాగంటి వెంకటరెడ్డి, నల్లపు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



వెల్లలూరులో రైతు శిక్షణ

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు మండలంలోని వెల్లలూరు గ్రామంలో ఆత్మ సౌజన్యంతో వరి లో సమగ్ర పంటల యాజమాన్యం అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమం లో జిల్లా వనరుల కేంద్రం నుండి డి పి డి డాక్టర్ పి రామాంజనేయులు , డాట్ సెంటర్ లాం గుంటూరు నుండి ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎం నగేష్ , పొన్నూరు సహా వ్యవసాయ సంచాలకులు వి.రామకోటేశ్వరి స్థానిక మండల వ్యవసాయ అధికారి డేగల వెంకట్రామయ్య మరియు వెల్లలూరు గ్రామ వ్యవసాయ సహాయకులు వై.అశ్విని వెల్లూరు గ్రామ రైతు సోదరులు పాల్గొన్నారు. రామాంజనేయులు మాట్లాడుతూ వెధ పద్ధతిలో నాటిన వరి లో విత్తన మోతాదు, విత్తన శుద్ధి భూమి తయారీ మొదలగు వాటి గురించి తెలియ జేశారు. అనంతరం డాట్ సెంటర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ పెంట మాలజీ డాక్టర్ ఎం నగేష్, పొన్నూరు సహాయ వ్యవసాయ సంచాలకులు వి. రామకోటేశ్వరి మాట్లాడారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-దుగ్గిరాల



ప్రమాదంలో గాయపడి ఇంటికే పరిమితమైన కార్పెంటర్ బడుగు నాగూర్ కుటుంబానికి ముఖ్య మంత్రి సహాయనిధి నుండి అందిన 7 లక్షల 50 వేల రూపా యలు చెక్కును మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు బుధవారం బాధి తుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. అంతకుముందు స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్లో నాడు నేడు ఫేసు వన్ కింద చేపట్టిన పనులకు గాను శిలాఫలకాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఎమ్మెల్యే మాట్లా డారు. కార్యక్రమంలో ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి జెడ్పిటిసి మేకతోటి అరుణ సర్పంచ్ బాణావతి ఖుషి బాయి, యాడ్ చైర్మన్ షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్ యూనివర్సిటీ విద్యార్థినికి పీహెచ్‌డీ



ప్రజాశక్తి-గుంటూరు :వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ కన్వెన్షనల్ ఇంజినీరింగ్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సివిల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థి వెన్నం స్వాతికి తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ బుధవారం తెలిపారు. స్వాతి 'యాన్ ఎక్సిపెరిమెంటల్ ఇన్వెస్టిగేషన్ ఆన్ పెర్ఫార్మెన్స్ ఆఫ్ హై-వాల్యూమ్‌ప్లై యాష్‌విత్ హైబ్రిడ్ ఫైబర్ బేస్డ్ కాంక్రీట్' అనే అంశంపై ఆమె పరిశోధన చేసిందన్నారు. ఈమెకు విజ్ఞాన్స్ యూనివర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఏ.శివశంకర్ గైడ్‌గా వ్యవహరించారన్నారు. డాక్టరేట్ పొందిన వెన్నం స్వాతిని ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.




నవజాత శిశువులతో డాక్టర్ రమ్య హారిక తదితరులు

24 గంటల్లో 21 మందికి కాన్పులు

డాక్టర్ చింతలపూడి రమ్యహారికకు పలువురి అభినందనలు

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

పిడుగురాళ్ళ పట్టణంలోని పల్నాడు హాస్పిటల్స్ అధినేత డాక్టర్ చింతలపూడి రమ్య హారిక అరుదైన రికార్డ్‌ను సొంతం చేసుకున్నారు. కేవలం 24 గంటల్లో 21 మంది గర్భిణులకు పల్నాడు హాస్పిటల్స్‌లో కాన్పులు చేశారు. కీళ్ళ మార్పిడీలో గోల్డ్ మెడల్ సాధించిన డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ సతీమణి డాక్టర్ రమ్య హారిక ప్రసూతి సంతాన సాఫల్య వైద్యంలో గోల్డ్ మెడలిస్టు. పల్నాడు ప్రాంత చుట్టుపక్కల ఎక్కడా లేని విధంగా ఒకే రోజులో 21 మంది గర్భిణులకు సిబ్బంది సహాయంతో కాన్పులు చేయడంతో ఆమెను పలువురు అభినందించారు. సోమవారం సాయంత్రం 5 గంటల నుండి మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు 21 కాన్పులు చేయగా అందులో 11 మంది మగ శిశువులు, 10 మంది ఆడ శిశువులు జన్మించారని, తల్లి, బిడ్డలు క్షేమంగా ఉన్నారని ఆమె తెలిపారు. తల్లులు, పిల్లలు క్షేమంగా వున్నారని వెల్లడించారు. పల్నాడు హాస్పిటల్స్‌లో ప్రసవించిన మాతృమూర్తులకు అమ్మకోసం పథకం వర్తించేలా చేస్తున్నామన్నారు. కాన్పు అయిన వారికి ఇన్సూరెన్స్ సర్టిఫికెట్స్ అందించడం జరిగిందని అశోక్ కుమార్ రమ్య హారిక దంపతులు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని పల్నాడు ఒయాసిస్ ఆస్పటల్‌లో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో చిన్న పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ సందీప్, మత్తు వైద్యులు వెంకట్, ఓ.టి స్టాఫ్, నర్సింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.



కార్మికుల వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

జిఎంసి ప్రధాన కార్యాలయంలో

ఇఎస్ఐ కార్డులు అప్‌డేషన్ క్యాంప్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం వరకూ జరుగుతున్న క్యాంప్‌లో జిఎంసి పరిధిలో విధులు నిర్వహిస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికులు తప్పనిసరిగా తమ ఈఎస్ఐ కార్డులను అప్‌డేట్ చేసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈఎస్ఐ నూతన నిబంధనల మేరకు కార్మికులందరూ తప్పనిసరిగా తమ ఈఎస్ఐ కార్డులను కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులతో అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఇప్పటికే ఏఈ, శానిటరీ ఇన్స్పెక్టర్ డివిజన్ల వారిగా కార్మికులకు రోజువారీ షెడ్యూల్ ఇచ్చామన్నారు. ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగాల నుండి ఆన్ లైన్ చేయడానికి కంప్యూటర్ ఆపరేటర్లను అందుబాటులో ఉంచామన్నారు. క్యాంప్‌నకు హాజరయ్యే కార్మికులకు త్రాగునీరు వంటి కనీస వసతులు కల్పించామన్నారు.కార్యక్రమంలో ఆప్కాస్ జనరల్ మేనేజర్ నాగ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో పెండింగ్ పనులు పూర్తికి చర్యలు

జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

మంగళగిరిలోని ఎయిమ్స్‌లో మౌలిక సౌకర్యాల పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డికి తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి రాష్ట్ర విభజనలో భాగంగా షెడ్యూల్-13లో పేర్కొన్న విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పన పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ కార్యాలయం వీసీ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, జేసీ రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ, డిఆర్ఒ కె.చంద్రశేఖర్‌రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎయిమ్స్ ముఖద్వారం వద్ద రహదారి విస్తరణకు అవసరమైన అటవీ భూముల సేకరణ ప్రక్రియ వెంటనే పూర్తి చేసేందుకు అటవీ శాఖ అధికారులతో కలసి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎయిమ్స్‌కు నీటిసరఫరా కోసం మంజూరు చేసిన వాటర్ వర్క్స్ పనులలో జాతీయ రహదారి వద్ద, అటవీ శాఖకు చెందిన స్థలాల వద్ద కొద్దిగా పైపులైను పనులు పెండింగ్‌లో ఉన్నాయని, పెండింగ్ పనులు పూర్తి అయ్యేలా అధికారులతో నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డికి కలెక్టర్ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కమిషనర్ శారదా దేవి, ఆర్ అండ్ బీ ఈఈ సమర్పణరావు, తాడేపల్లి తహాశీల్దారు నాగిరెడ్డి, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఓటరు సర్వే 97.69 శాతం పూర్తి : గుంటూరు కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో తప్పులకు అవకాశం లేని ఓటర్ల జాబితా రూపొందించేలా ఇంటింటికి ఓటరు కార్డు వెరిఫికేషన్ ప్రక్రియ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం సక్రమంగా పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, నగర కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ, డిఆర్ఒ కె.చంద్రశేఖర్‌రావుతో కలిసి ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్-2024పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షించారు. సమావేశంలో ఆప్ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ టి.సేవాకుమార్, బిఎస్‌పి నాయకులు సిహెచ్. వాసు, బిజెపి నాయకులు రాచమల్లు భాస్కరరావు, కాంగ్రెస్ నాయకులు బి.సునీల్, టిడిపి తరపున నాయుడు ఓంకార్, వైసిపి నాయకులు అత్తోట. జోసెప్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటింటికీ ఓటరు కార్డుల వెరిఫికేషన్ ఇప్పటి వరకు దాదాపు 97.69 శాతం పూర్తి చేసినట్లు చెప్పారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఇంటింటికీ మరో మూడు రోజులు జరగనుందని, నూరు శాతం ఓటరు వెరిఫికేషన్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఎస్ ఎస్ ఆర్ 2024 కు సంబంధించి ఓటు తొలగింపు కోసం వచ్చిన దరఖాస్తుల వివరాలను ప్రతి నెల 10వ తేదీ నియోజకవర్గాల వారీగా రాజకీయపార్టీలకు జాబితాలు అందించటం జరుగుతుందన్నారు. వీటిని పరిశీలించి వాటిపై అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఈఆర్వోకు రాజకీయపార్టీల ప్రతినిధులు తెలియజేయవచ్చన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారమే షిఫ్ట్ అయిన వారి ఓట్లు తొలగించటం జరుగుతుందన్నారు. గతంలో ఒక ప్రాంతంలో అద్దెకు ఉన్న చిరునామాలో ఓట్లు ఉండి తరువాత వేరే ప్రాంతాలకు వెళ్ళిన వారు తప్పనిసరిగా ప్రస్తుత చిరునామాకు ఓటుకార్డు బదిలీ చేసుకోవాలన్నారు. దీనిపై రాజకీయపార్టీలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పట్టణాల్లో, గ్రామీణ ప్రాంతాల్లోను దీనిపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగహన కల్పించేలా ఈఆర్వోలు విస్తత స్థాయిలో ప్రచారం నిర్వహించాలన్నారు. సమావేశంలో ఈఆర్వోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లలితా, వెంకటశివ రామిరెడ్డి, ఆర్డీవో ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

టంగుటూరికి కలెక్టర్ నివాళి



ప్రజాశక్తి-గుంటూరు

స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రరాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంతి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ, గుంటూరు నగర కమిషనర్ కీర్తిచేకూరి, డిప్యూటీ కలెక్టర్ లలిత తదితరులు టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సంధర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం పంతులు చరిత్రలో నిలిచారని, భారత స్వాతంత్ర పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. ఆయన తాను నమ్మిన సిద్ధాంతాలపై నడిచేవారన్నారు. నైతికంగా వ్యవహరించడంలో ఆయనకు ఆయనే సాటి అన్నారు. సైమన్ కమిషన్ గోబ్యాక్ అని, తన గుండెను చూపి ' గుండుతో ముందు నన్ను కాల్చండి' అని సవాల్ చేసి ఎదురొడ్డిన ధైర్యశాలి అని అన్నారు. టంగుటూరి అడుగు జాడలలో యువత నడవాల్సి వుందన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.చంద్రశేఖర్‌రావు, ఆర్‌డిఒ ప్రభాకర్‌రెడ్డి, నగర అడిషనల్ కమిషనర్ పెద్దిరోజా, నర్సారెడ్డి, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దుర్గాబాయి, కలెక్టరేట్ ఏ.ఓ పూర్ణచంద్రరావు తదితరులు మాట్లాడారు.



పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్

ఎన్‌సిసి పరీక్షల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థినులు ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల విద్యార్థినులు 10(ఎ) గరల్స్ బెటాలియన్ ఎన్‌సిసి గుంటూరు కేడెట్స్ 'బి' సర్టిఫికెట్ పరీక్షల్లో ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఫాతిమారాణి తెలిపారు. 20 మంది పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణులు అయ్యారన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఎన్‌సిసి కేడెట్లను అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్ ఎల్‌టికె.సుస్మిత, ఫిజికల్ డైరెక్టర్ జి.బాలశౌరెడ్డిని, ఎన్‌సిసి కేడెట్స్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు. అనంతరం కేడెట్స్‌కు బి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

చంద్రయాన్-3 విజయం దేశానికి గర్వకారణం

బిఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ తోట చంద్రశేఖర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చంద్రుడి దక్షిణ ధ్రువంపై సురక్షితంగా ల్యాండ్ అయ్యి చంద్రయాన్ 3 విజయవంతమై భారత్ ప్రపంచ చరిత్ర సృష్టించిందని భారత రాష్ట్ర సమితి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు డాక్టర్ తోట చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రయాన్ -3 జాబిల్లి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలి దేశంగా భారత్ కీర్తిని గడించిందన్నారు. మిషన్ చంద్రయాన్ విజయవంతం కావడంతో అంతరిక్ష చరిత్రలో భారత్ సువర్ణాధ్యాయం లిఖించిందన్నారు . శాస్త్ర సాంకేతికరంగంలో అగ్రగామిగా నిలిచిన భారత్ ప్రపంచంలో ఓ సూపర్ పవర్ గా ఆవిష్కృతమైందని కొనియాడారు. ప్రతిష్టాత్మకమైన ఈ మిషన్ ను విజయవంతం చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు వేత్తలకు శుభాభినందనలు తెలిపారు. ఈ విజయం ప్రతి ఒక్క భారతీయుడికి గర్వకారణమన్నారు.

గర్వంతో ఉప్పొంగిన క్షణాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ చేపట్టిన ప్రతిష్టాత్మక చంద్రయాన్ - 3 ప్రయోగం విజయవంతం అవటంతో 140 కోట్ల భారతీయుల హృదయాలు గర్వంతో ఉప్పొంగుతున్నాయని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు నేరేళ్ళ సురేష్ అన్నారు. చంద్రయాన్ - 3 ప్రయోగం విజయవంతం అయిన సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి ఆధ్వర్యంలో శ్రీనివాసరావుతోటలో బాణాసంచా కాల్చుతూ, స్వీట్లు పంపిణీ చేస్తూ విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. విజయోత్సవ వేడుకల్లో డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ షర్ఫుద్దీన్ , నగర కమిటీ సభ్యుల రవీంద్ర, బాషా, సాయి పాల్గొన్నారు.